

మగువల్లో ఆధ్యాత్మిక చైతన్యం

కోలాటంలో రాణిస్తున్న ఎన్‌జీపాలెం మహిళలు

- పండుగలు, ఉత్సవాల సందర్భంగా ప్రదర్శనలు
- శరీరానికి ఆరోగ్యం, మనస్సుకు ఆహ్లాదం



• 8లో

పాఠశాలల పనివేళలు పెంపు



హైస్కూళ్లలో రోజూ గంటపాటు అదనంగా బోధన

- ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తరగతులు
- పైలట్ ప్రాజెక్టు కింద జిల్లాలో 30 పాఠశాలలు ఎంపిక
- ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా విద్యా శాఖ అధికారి



పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన నర్సీపట్నం జడ్పీ బాలికోన్నత పాఠశాల

నర్సీపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):

ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పని వేళలు మారనున్నాయి.ప్రస్తుతం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు తరగతులు నిర్వహిస్తుండగా, ఇకపై సాయంత్రం ఐదు గంటల వరకు పాఠశాలలు నడుస్తాయి. పని వేళలను ఒక గంట పొడిగిస్తూ జిల్లా విద్యా శాఖ అధికారి ఉత్తర్వులు జారీచేశారు. అయితే అన్ని పాఠశాలల్లో ఒకేసారి కాకుండా.. మండలానికి ఒక పాఠశాల చొప్పున పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. నర్సీపట్నం, అనకాపల్లి, చోడవరం, గొలుగొండ, పరవాడ, సబ్బవరం మండలాల్లో రెండేసి పాఠశాలలను ఎంపిక చేశారు. పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన 30 పాఠశాలల్లో ఈ నెల 20వ తేదీ నుంచి పది రోజులు పాటు పని వేళలు పొడిగించి నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చారు.

పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన పాఠశాలలు

నర్సీపట్నం మండలంలో గబ్బాడ హైస్కూల్, నర్సీపట్నం టౌన్‌లో జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, అనకాపల్లిలో బాలికోన్నత పాఠశాల, అనకాపల్లి మండలంలో కూండ్రం హైస్కూల్, గొలుగొండ మండలంలో ఏఎల్‌పురం చీడిగుమ్మల, చోడవరం మండలంలో లక్ష్మీపురం, చోడవరం బాలికోన్నత పాఠశాలలు, పరవాడ మండలంలో పరవాడ, లంకెలపాలెం హైస్కూళ్లు, సబ్బవరం మండలంలో సబ్బవరం, నంగినారపాడు ఉన్నత పాఠశాలలు, అచ్యుతాపురం మండల కేంద్రంలో హైస్కూల్, బుచ్చెయ్యపేట మండలంలో దిబ్బిడి, దేవరాపల్లి, చీడికాడ, కె.కోటపాడు, కోటవురట్ల మండలంలో జల్లూరు, కశింకోట, మునగపాక, రావికమతం, ఎస్.రాయవరం, వి.మాడుగుల, రోలుగుంట, నాతవరం, మాకవరపాలెం, రాంబిల్లి, నక్కపల్లి, పాయకరావుపేట బాలికోన్నత పాఠశాల, ఎలమంచిలి మండలం కొత్తపేట ఉన్నత పాఠశాల.

పనివేళలు..

ఉదయం 9 గంటలకు ఫస్ట్ బెల్, 9.05 కి సెకెండ్ బెల్, 9.05 నుంచి 9.25 వరకు అసెంబ్లీ నిర్వహించాలి. ఫస్ట్ పీరియడ్ 9.25 నుంచి 10.15 గంటలు, సెకెండ్ పీరియడ్ 10.15 నుంచి 11 గంటలు, 11 గంటలు నుంచి 11.15 వరకు విరామం. మూడో పీరియడ్ 11.15 నుంచి 12 గంటలు, నాలుగో పీరియడ్ 12 నుంచి 12.45 గంటలు. 12.45 నుంచి 1.45 వరకు మధ్యాహ్న భోజనం విరామం. 1.45 నుంచి 2.30 గంటల వరకు ఐదో పీరియడ్, 2.30 నుంచి 3.15 గంటల వరకు ఆరో పీరియడ్ నిర్వహించాలి. తర్వాత విద్యార్థులకు పావుగంట విరామం ఇవ్వాలి. ఏడో పీరియడ్ 3.30 నుంచి 4.15 గంటల వరకు, ఎనిమిదో పీరియడ్ 4.15 నుంచి 5 గంటల వరకు ఉంటుంది. నెలాఖరు వరకు ఈ విధానాన్ని అమలు చేసి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల అభిప్రాయాలు తీసుకొని జిల్లా విద్యా శాఖ అధికారికి పంపించాలని ఆదేశాలు ఇచ్చారు.

బాలికలకు ఇబ్బందే

నర్సీపట్నం మండలం గబ్బాడ స్కూల్‌లో పనివేళలు పొడిగిస్తూ డీఈవో ఉత్తర్వులు ఇచ్చారని, సాయంత్రం 5 గంటలు వరకు తరగతులు నిర్వహించడం వల్ల బాలికలు ఇబ్బంది పడతారని పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు అడిగర్ల వరహాలనాయుడు, జీవీ రమేశ్ తెలిపారు. ఐదారు కిలో మీటర్ల దూరం నుంచి సైకిళ్లు మీద వచ్చే బాలికల గురించి అధికారులు ఎందుకు ఆలోచించడం లేదని ప్రశ్నించారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా

- డిసెంబరు 5 నుంచి 14వ తేదీ వరకు నిర్వహణ

అనకాపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా పడ్డాయి. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 21వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ఎన్నికలు నిర్వహించాలి. కానీ శాసనసభ సమావేశాలు జరుగుతుండడంతో ఎన్నికలు రెండు వారాలపాటు ప్రభుత్వం వాయిదా వేసింది. డిసెంబరు 5వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఎన్నికలు జరపాలని నిర్ణయించింది. ఈ మేరకు గురువారం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. జిల్లాలో నాలుగు (తాండవ, రైవాడ, కోనాం, పెద్దేరు) ప్రాజెక్టు కమిటీలు, మూడు నీటి పంపిణీ సంఘాలు (డిస్ట్రిబ్యూటరీ కమిటీలు), 303 నీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయి. ఎన్నికల నిర్వహణకు కలెక్టర్ విజయకృష్ణన్ ఇప్పటికే 2,198 మంది ఉద్యోగులను నియమించారు. సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు డిసెంబరు 5వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేస్తారు. 8న ప్రాదేశిక సభ్యులు, నీటి వినియోగదారుల సంఘాల సభ్యులు, అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఎన్నికలు జరగనున్నాయి. ప్రాజెక్టు కమిటీలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు 11న ఎన్నికలు జరగనున్నాయి.

ముగ్గురు ఉపాధి సిబ్బంది సస్పెన్షన్

పాయకరావుపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) :

మండలంలో ఉపాధి హామీ పథకం ఏపీఓ, మరో ఇద్దరు సిబ్బందిని సస్పెండ్ చేస్తూ జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు సంబంధించి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం. పాయకరావుపేట మండలంలో ఉపాధి హామీ పథకం నిర్వహణలో అవకతవకలు, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారంటూ ఏపీఎం హేమలత, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ వీరబాబు, టెక్నికల్ అసిస్టెంట్ అచ్యుతరావులను సస్పెండ్ చేశారు. ఈ మేరకు జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని స్థానిక అధికారులు తెలిపారు.

ఇసుక కొరతకు తెర!

త్వరలో నిల్వ యార్డులు



అనకాపల్లి సమీపంలో గతంలో ఏర్పాటు చేసిన ఇసుక డిపో (ఫైల్ ఫొటో)

- ఆరుచోట్ల ఏర్పాటుకు టెండర్లు
- ప్రైవేటు వ్యక్తులకు నిర్వహణ బాధ్యతలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో భవన నిర్మాణదారులకు ఇసుక కొరత సమస్య త్వరలో తీరనున్నది. నూతన ఇసుక పాలసీని పక్కాగా అమలు చేయడం ద్వారా భవన నిర్మాణదారులకు ఇబ్బంది లేకుండా ఇసుక సరఫరా చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇసుక యార్డుల నిర్వహణ బాధ్యతలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించనున్నది. దీంతో ఇసుక అందుబాటులోకి రావడంతోపాటు అక్రమ తవ్వకాలు, రవాణాకు చెక్ పడుతుంది.

జిల్లాలోని నదుల్లో తగినంత ఇసుక నిల్వలు లేని కారణంగా రీచ్‌లకు పర్యావరణ శాఖ అనుమతి ఇవ్వలేదు. దీంతో జిల్లాలో భవన నిర్మాణాలకు అవసరమైన ఇసుకను అటు తూర్పుగోదావరి జిల్లా, ఇటు శ్రీకాకుళం జిల్లాలోని గోదావరి, వంశధార, నాగవళి నదుల నుంచి రప్పించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రైవేటు వ్యాపారులు ఆయా నదుల నుంచి ఇసుక తీసుకువచ్చి అధిక ధరకు అమ్ముకుంటున్నారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో వ్యక్తిగత అవసరాలకు స్థానిక నదుల్లో ఉచితంగా ఇసుక తవ్వకొని ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లపై తీసుకు వెళ్లేందుకు వెసులుబాటు కల్పించింది. ఇదే అదనుగా భావించిన కొంతమంది అక్రమార్కులు నదుల్లో ఎడాపెడా ఇసుక తవ్వకాలు జరుపుతూ దర్జాగా అమ్ముకుంటున్నారు. పగలు నదుల్లో ఇసుకను తవ్వి ఎడ్ల బండ్లతో సమీపంలో కుప్పలుగా పోస్తున్నారు. చీకటి పడిన తరువాత ట్రాక్టర్లు, లారీల్లో ఇసుక రవాణా చేస్తూ రెండు చేతులా సంపాదిస్తున్నారు. ఇది కూడా ప్రభుత్వం దృష్టికి రావడంతో ఇసుక డిపోలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

జిల్లాలో ఆరు ఇసుక నిల్వ యార్డులు

జిల్లాలో కొత్తగా ఇసుక నిల్వ యార్డుల ఏర్పాటుకు కలెక్టర్ విజయకృష్ణన్ అనుమతి ఇచ్చారు. అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, మాడుగుల, నక్కపల్లి, అచ్యుతాపురంలో ఇసుక నిల్వ యార్డులను ఏర్పాటు చేసేందుకు టెండర్ల ప్రక్రియ మొదలైంది. ఆయా ప్రదేశాల్లో కనీసం నాలుగు ఎకరాల ఖాళీ స్థలం అందుబాటులో వున్న వారు ఇసుక డిపో నిర్వహణకు దరఖాస్తు చేసుకోవాలి. గనుల శాఖ అధికారులు జిల్లా ఇసుక కమిటీ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తారు. వారికి మినరల్ డీలర్ లైసెన్స్ జారీ చేసి, ఇసుక నిల్వ యార్డులను నిర్వహణను అప్పగిస్తారు.

రియల్టర్ దందా

గోర్జి కప్పి రోడ్డు నిర్మాణం


- ఎకరా ప్రభుత్వ భూమి ఆక్రమణ
- విలువ కోటి రూపాయలు



గోర్జి కప్పి వేసిన రోడ్డు

అచ్యుతాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని మడుతూరు పంచాయతీలో ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి ప్రభుత్వ భూమిని దర్జాగా ఆక్రమించుకొని రోడ్డు నిర్మించాడు. ఇందుకోసం ఏపుగా పెరిగిన తాటిచెట్లను నేలకూల్చారు. ప్రభుత్వ భూమిలో రోడ్డు నిర్మాణం చేపట్టవద్దంటూ వీఆర్వో రోడ్డు మధ్యన కాలువ తవ్వగా.. దానిని కప్పేసి రోడ్డు పనులు కొనసాగించారు.



రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా నమోదైన గోర్జి

మడుతూరు పంచాయతీ శివారు ఎరికిరెడ్డిపాలెం వద్ద మడుతూరు- దోసూరు ప్రధాన రహదారికి దూరంగా ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి సుమారు ఇరవై ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. ఈ భూమిలోకి వెళ్లడానికి రహదారి లేదు. దీంతో కొనుగోలు చేసిన భూముల పక్క నుంచి వెళ్లే కొండ గోర్జిపై పడింది. వర్షం నీరు మేకరాశి కొండ నుంచి ఎరికిరెడ్డిపాలెం మీదుగా దిగువనున్న చెరువులోకి వెళుతుంది. వర్షాకాలంలో గోర్జిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. కాగా రియల్ ఎస్టేట్ వ్యాపారి.. సర్వే నంబరు 447లో వున్న గోర్జిలో సుమారు ఎకరా స్థలాన్ని ఆక్రమించి తాను కొనుగోలు చేసిన భూమి వరకు రోడ్డు ... మిగతా 8వ పేజీలో

గ్రామాల్లో స్మార్ట్ మీటర్లు

తొలుత వాణిజ్య కేటగిరీ విద్యుత్ కనెక్షన్లకు బిగింపు

- పంచాయతీల తాగునీటి పథకాలు, వీధి దీపాలకు సైతం..

కోటవురట్ల, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి):

విద్యుత్ సేవలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ ఈపీడీసీఎల్ అధికారులు కొత్తగా స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ చౌర్యానికి చెక్ పెట్టడంతోపాటు మీటరు రీడింగ్ ఆన్‌లైన్ చేయడానికి ఇది దోహదపడుతుంది. పట్టణ ప్రాంతాల్లో వాణిజ్య కేటగిరీలకు, ప్రభుత్వం కార్యాలయాలు, సంస్థలకు ఇప్పటికే స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియ ప్రారంభం కాగా.. తాజాగా గ్రామీణ ప్రాంతాల్లో కూడా స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారు. మండల కేంద్రమైన కోటవురట్లలో నెల రోజుల నుంచి వాణిజ్య విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. తాగునీటి పథకాలు, వీధి దీపాలు, ప్రభుత్వ కార్యాలయాలకు కూడా వీటిని బిగిస్తున్నారు.

విద్యుత్ చౌర్యానికి చెక్

నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన స్మార్ట్ మీటర్లతో విద్యుత్ చౌర్యానికి పూర్తిగా చెక్ పెట్టవచ్చని ఈపీడీసీఎల్ అధికారులు పేర్కొంటున్నారు విద్యుత్ వినియోగానికి సంబంధించి సిబ్బంది ప్రతి నెలా వచ్చి రీడింగ్ తీయాల్సిన అవసరం వుండదు. ఆన్‌లైన్ ద్వారా మానిటరింగ్ కేంద్రానికి మీటర్ రీడింగ్ చేరుతుంది. ఎన్ని యూనిట్లు వాడారు? ఎంత బిల్లు చెల్లించాలి? అన్న వివరాలు సంబంధిత వినియోగదారుని మొబైల్ ఫోన్‌కు మెసెజ్ ద్వారా తెలియపరుస్తారు. గడువులోగా బిల్లు చెల్లించకపోతే మానిటరింగ్ కేంద్రం నుంచే స్మార్ట్ మీటర్ ద్వారా విద్యుత్ సరఫరాను నిలిపివేసే అవకాశం ఉంటుంది. లైన్‌మెన్ ఇళ్లకు వచ్చి ఫ్యూజులు తీసుకెళ్లాల్సిన పని వుండదు. ఎవరైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే స్మార్ట్ మీటర్ వెంటనే మానిటరింగ్ కేంద్రానికి సమాచారం పంపుతుంది. దీంతో విద్యుత్ చౌర్యాన్ని వెంటనే అరికట్టడమే కాకుండా సంబంధిత వ్యక్తిపై చర్యలు తీసుకుంటారు. విద్యుత్ సరఫరా నిచిలిపోతే ఎక్కడ, ఎందుకు సరఫరా నిలిచిపోయిందో స్మార్ట్‌మీటర్ ద్వారా వెంటనే మానిటరింగ్ కేంద్రానికి సంకేతాలు వస్తాయి. సిబ్బంది నేరుగా అక్కడకు వెళ్లి సమస్యను పరిష్కరిస్తారు.



కోటవురట్ల పంచాయతీలో వీధి దీపాలకు స్మార్ట్ మీటర్ బిగిస్తున్న సిబ్బంది

ఇదిలావుండగా రెండో దశలో గృహ వినియోగ విద్యుత్ కనెక్షన్లకు కూడా స్మార్ట్‌మీటర్లు బిగిస్తారు. అనంతరం విద్యుత్ బిల్లుల చెల్లింపును మొబైల్ ఫోన్ల తరహాలో ప్రిపెయిడ్ రీచార్జీని అమలు చేస్తారు. ప్రస్తుతం ప్రతి నెలా విద్యుత్ సిబ్బంది మీటర్ రీడింగ్ తీసిన తరువాత పక్షం రోజుల్లో బిల్లు చెల్లించే వెసులుబాటు వుంది. స్మార్ట్ మీటర్లను అందుబాటులోకి తీసుకు వచ్చిన తరువాత వినియోగదారులు ముందుగానే కార్డు ద్వారా డబ్బులు చెల్లించాలి. వినియోగించిన విద్యుత్‌కు సరిపడ డబ్బులు అయిపోతే వెంటనే రీచార్జి చేసుకోవాలి.

పింఛన్‌దారులకు భరోసా!

నిబంధనలను సరళీకృతం చేసిన ప్రభుత్వం



- ఒక నెల గడువును మూడు నెలలకు పెంచుతూ వెసులుబాటు
- వచ్చే నెల నుంచి అమలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి సంబంధించిన నిబంధనలను సరళీకృతం చేసింది. ఇప్పటి వరకు ఏ నెల పింఛన్‌ను ఆ నెలలోనే తీసుకోవాలి. అనివార్య కారణాల వల్ల ఒక నెలలో పింఛన్ తీసుకోలేకపోతే మరుసటి నెలలో ఆ డబ్బులు ఇవ్వరు. దీనివల్ల ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి రావడంతో నిబంధనలు సడలించాలని నిర్ణయం తీసుకుంది. వరుసగా రెండు నెలలపాటు పింఛన్ తీసుకోకపోయినప్పటికీ మూడో నెలలో మొత్తం మూడు నెలల పింఛన్ డబ్బులు పొందే వెసులుబాటు కల్పించింది. ఈ విధానాన్ని డిసెంబరు నుంచి అమలు చేయనున్నారు. ఈ మేరకు జిల్లా గ్రామీణాభివృద్ధి (డీఆర్‌డీఏ) అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది.

గత వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పింఛన్లకు సంబంధించిన నిబంధలను కరోనా వైరస్ ప్రబలి సమయంలో మార్చి వేసింది. లబ్ధిదారులు స్థానికంగా లేకపోయినా, ఆన్‌లైన్‌లో వేలి ముద్రలు నమోదు కాకపోయినా.. ఆ నెల పింఛన్ డబ్బులను మరుసటి నెలలో ఇచ్చేవారు కాదు. అంతేకాకుండా వరుసగా మూడు నెలలపాటు పింఛన్ తీసుకోలేకపోతే ఆయా లబ్ధిదారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా జాబితా నుంచి పేర్లు తొలగించేవారు. దీంతో అనేకమంది పింఛన్‌లు ... మిగతా 8వ పేజీలో

చోరీ కేసుల్లో ముగ్గురి అరెస్టు

- రూ.21.3 లక్షల విలువ చేసే సొత్తు స్వాధీనం

అనకాపల్లి రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగిన పలు చోరీ కేసుల్లో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.21.3 లక్షల విలువ చేసే బంగారం, ద్విచక్ర వాహనాలు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ తుహిన్ సిన్హా గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియాసమావేశంలో వెల్లడించారు.

188 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ తుహిన్ సిన్హా పేర్కొన్నారు. గురువారం పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ తుహిన్‌సిన్హా ఆయా చోరీ కేసులకు సంబంధించి వివరాలను వెల్లడించారు. అచ్యుతాపురం, పరవాడ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఐదు చోరీ కేసులకు సంబంధించి సుమారు రూ.10 లక్షలు విలువ గల 143 గ్రాముల బంగార ఆభరణాలను స్వాధీనం చేసుకుని ఒక నిందితుడిని అరెస్టు చేసినట్టు ఆయన తెలిపారు. అలాగే ఎలమంచిలి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన నాలుగు చోరీ కేసుల్లో సుమారు రూ.11.3 లక్షల విలువ గల 45 గ్రాముల బంగారం, నాలుగు ద్విచక్ర వాహనాలు, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్టు ... మిగతా 8వ పేజీలో



స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తును పరిశీలిస్తున్న ఎస్పీ తుహిన్‌సిన్హా, అధికారులు

నర్సీపట్నం పెద్ద చెరువుకు మహర్దశ

- ట్యాంక్ బండ్ తరహాలో అభివృద్ధి
- రూ.10.5 కోట్లతో ఆర్‌అండ్‌బీ, పర్యాటక శాఖల అంచనాలు
- స్పీకర్ దృష్టికి తీసుకెళ్లిన అధికారులు
- పనులు త్వరగా పూర్తిచేయాలని అయ్యన్నపాత్రుడు ఆదేశం



అమరావతిలో ఆర్‌అండ్‌బీ, పర్యాటక శాఖ అధికారులతో సమావేశమైన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):

నర్సీపట్నంలోని పెద్ద చెరువుని హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ తరహాలో అభివృద్ధి చేయాలన్నది తన చిరకాల స్వప్నమని శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. గురువారం అమరావతిలో పర్యాటక, ఆర్‌అండ్‌బీ శాఖల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నర్సీపట్నంలో ట్యాంక్ బండ్ పనులు చేపట్టడానికి ఆర్‌అండ్‌బీ శాఖ రూ.4.1 కోట్లు, పర్యాటక శాఖ 6.4 కోట్లు.. మొత్తం రూ.10.5 కోట్లు ఖర్చు అవుతుందని అంచనాలు తయారు చేసి స్పీకర్ దృష్టికి తీసుకువెళ్లారు. డిసెంబరు 15వ తేదీలోగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, ఇతర శాఖల అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ నయీమ్ ముల్లా, సీఈ శ్రీనివాసరెడ్డి, పర్యాటక శాఖ అధికారులు పాల్గొన్నారు.

మంత్రి కొల్లు రవీంద్రను కలిసిన ప్రగడ



మంత్రి కొల్లు రవీంద్రతో ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్, గనుల శాఖల మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్రను ఏపీ రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో ఆయన్ని సత్కరించారు. విజయవాడలో తన ప్రమాణస్వీకారం కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన మంత్రిని ఆహ్వానించారు.

మళ్ల సురేంద్రకు అభినందనలు



మళ్ల సురేంద్రకు అభినందనలు తెలుపుతున్న ప్రగడ నాగేశ్వరరావు, నాగజగదీశ్వరరావు

ఎలమంచిలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్రను విజయవాడలో ఏపీ ఆర్డీసీ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు అభినందనలు తెలిపారు. గురువారం విజయవాడలో జరిగిన ప్రమాణ స్వీకారం అనంతరం కలిసి అభినందనలు తెలిపారు.

25వ తేదీలోపు సభ్యత్వ నమోదు పూర్తి చేయాలి

» బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వుడా రమేష్



కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న బీజేపీ నేతలు

ఎలమంచిలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 25వ తేదీలోపు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వుడా రమేశ్ అన్నారు. గురువారం స్థానిక బీజేపీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..గ్రామ గ్రామాన పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కో-కన్వీనర్ నక్కా శివ, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టా దాసుబాబు, బీజేపీ సీనియర్ నేత పప్పు ఈశ్వరరావు, చరకం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మళ్ల సురేంద్రకు సత్కారం



మళ్ల సురేంద్రను సత్కరించిన భీమరశెట్టి శ్రీనివాస్

ఎస్.రాయవరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన మళ్ల సురేంద్రను గురువారం గొల్లపూడి బీసీ భవన్ కార్యాలయంలో ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడు భీమరశెట్టి శ్రీనివాస్ పలువురి నాయకులతో కలిసి సత్కరించారు. సురేంద్రను అభినందించిన వారిలో పాయకరావుపేట నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు మలిపెద్ది సతీష్, పార్లమెంట్ ఐటీడీపీ సభ్యుడు మడదా రాంబాబు, అనకాపల్లి ఐటీడీపీ అధ్యక్షుడు పీలా శ్రీనివాస్ ఉన్నారు.

రైతులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఎలమంచిలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతులు, కార్మికుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్. శివాజీ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈనెల 26వ తేదీన అనకాపల్లి నెహ్రూచౌక్ వద్ద నిర్వహించతలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు చిరంజీవి పాల్గొన్నారు.

'కూలీలకు ఉపాధి పనులు కల్పిస్తాం'

ఎస్.రాయవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం అగ్రహారంలో పనులు లేక ఇబ్బందులు పడుతున్న కూలీలకు ఉపాధి పనులు కల్పిస్తామని ఉపాధి హామీ మండల టెక్నికల్ అసిస్టెంట్ శివ తెలిపారు. తమకు ఉపాధి హామీ పనులు కల్పించాలని కూలీలు ఆ గ్రామంలో ఇటీవల నిరసన వ్యక్తం చేశారు. దీనిపై ఏపీవో ఎరకయ్య స్పందిస్తూ గురువారం ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్‌ను ఆ గ్రామానికి పంపించారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ పనులు కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని, ఫీల్డ్ అసిస్టెంట్‌ను గాని, పంచాయతీ కార్యదర్శిని గాని సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం. అప్పలరాజు పాల్గొన్నారు.

చెస్ టోర్నీలో విద్యార్థులకు వెండి పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపక సిబ్బంది

ఎలమంచిలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏయూ అంతర కళాశాలల చెస్ టోర్నీలో స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి వెండి పతకాలను కైవసం చేసుకున్నట్టు పీడీ వై.పోలిరెడ్డి తెలిపారు. ఏయూలో ఈ నెల 19, 20వ తేదీల్లో జరిగిన చెస్ పోటీల్లో కళాశాలకు చెందిన పి.దుర్గాప్రసాద్, వై.సింహాద్రి, వి.పవన్ దత్త, పి.కౌశిక్, జె. శ్రీను, టి. వాసు ప్రతిభ ప్రదర్శించారన్నారు. విద్యార్థులతో పాటు పీడీ పోలిరెడ్డిలను ప్రిన్సిపాల్ డా. చంద్రశేఖర్, అధ్యాపకులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకరావుపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో పట్టణంలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. చెట్టు కొమ్మలు తొలగింపులో భాగంగా మంగవరం రోడ్డు, జగతావారి వీధి, ఆర్టీసీ కాంప్లెక్స్, పాండురంగస్వామి గుడి, మెయిన్‌రోడ్డులోని ఆర్‌సీఎం చర్చి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పేట, ఎలమంచిలి పోలీస్ స్టేషన్లను తనిఖీ చేసిన డీఐజీ



పాయకరావుపేటలో సీఐలతో మాట్లాడుతున్న డీఐజీ గోపినాథ్ జెట్టి



ఎలమంచిలి పట్టణ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డీఐజీ గోపీనాథ్ జెట్టి

పాయకరావుపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి గురువారం పాయకరావుపేట, ఎలమంచిలి పట్టణ పోలీస్ స్టేషన్లను తనిఖీ చేశారు. ఎస్పీ తుహిన్‌సిన్హాతో కలిసి డీఐజీ గోపినాథ్ జెట్టి వార్షిక తనిఖీల్లో భాగంగా పాయకరావుపేట పట్టణ పోలీస్ స్టేషన్‌ని సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేశారు. పరిసరాలు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట డీఎస్పీ జీఆర్ఆర్.మోహన్, సీఐలు జి.అప్పన్న, కుమారస్వామి, రామకృష్ణ ఉన్నారు.

ఎలమంచిలిలో..

స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌ను గురువారం విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి సందర్శించారు. ఎస్పీ తుహీన్ సిన్హాతో కలిసి ఆయన స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్‌లోని పలు కేసులకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. పోలీసింగ్ మరింత బాగా చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పరవాడ డీఎస్పీ సత్యనారాయణ, సీఐ ధనుంజయరావు, ఎస్ఐ సావిత్రి, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపట్నం నుంచి వెంకటాపురం వరకు తారు రోడ్డు వేయాలి

» గోవిందపాలెం జంక్షన్‌లో ప్రజా సంఘాల ఆందోళన



గోవిందపాలెం జంక్షన్ వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న ప్రజలు

రాంబిల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపట్నం నుంచి వెంకటాపురం వరకు తారురోడ్డు వేయాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గోవిందపాలెం జంక్షన్‌లో పలు గ్రామాల ప్రజలు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఎన్ఏఓబీ ఏర్పాటు కావడంతో భారీ వాహనాల రాకపోకలు ఎక్కువ అయ్యాయన్నారు. ఓవర్‌లోడుతో లారీలు తిరుగుతుండడంతో రోడ్లు పాడై, పెద్ద పెద్ద గోతులు ఏర్పాడాయన్నారు. దుమ్ము, ధూళి బారి నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని, నేవీ రోడ్డుపై హెవీ లోడుతో వస్తున్న భారీ వాహనాలను రోడ్డు నిర్మాణం చేపట్టేంతవరకు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న సీఐ నర్సింగరావు ఆందోళన చేస్తున్న ప్రజాసంఘాల నాయకులతో మాట్లాడారు. ఎల్అండ్‌టీ కంపెనీ ప్రతినిధులు, నేవీ పీడీతో మాట్లాడి తక్షణమే రోడ్డును తడిపించేందుకు చర్యలు తీసుకుంటామని, కొత్తరోడ్డు నిర్మాణానికి అధికారులతో మాట్లాడతానని సీఐ నర్సింగరావు హామీ ఇవ్వడంతో ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచులు, ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ పూడిమడక మత్స్యకారుల నిరసన



పూడిమడక తీరంలో నినాదాలు చేస్తున్న మత్స్యకారులు

అచ్యుతాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మత్స్యకారులు పూడిమడక తీరం వద్ద నినాదాలు చేశారు. గురువారం మత్స్యకార దినోత్సవం సందర్భంగా పూడిమడక తీరంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ చేపల వేట నిషేధ సమయంలో ఇవ్వాల్సిన మత్స్యకార భరోసాను వెంటనే పంపిణీ చేయాలని, పూడిమడక వద్ద ప్రారంభించిన హార్బర్‌ని పూర్తి చేయాలన్నారు. అలాగే పూడిమడక వద్ద ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్ ఏర్పాటుచేస్తున్నందున 50 ఏళ్ల నిండిన మత్స్యకారులకు రూ.20 లక్షలు ప్యాకేజీ ఇవ్వాలని, పూడిమడక యువకులకు ఉపాధి కల్పించాలని, పూడిమడకలో ఎన్‌టీపీసీ ఆసుపత్రి నిర్మించి ఉచితంగా వైద్యం అందించాలని, మత్స్యకారులందరికీ ఉచిత విద్యుత్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు వాసుపల్లి శ్రీనివాసరావు, చోడిపల్లి అప్పారావు, ఉమ్మిడి అప్పారావు, చేపల తాతలు, ఉమ్మిడి జగన్ పాల్గొన్నారు.

సాగునీటి కోసం రైతుల పాట్లు

» దెబ్బతిన్న గ్రోయిన్ వద్ద శ్రమదానం



దెబ్బతిన్న గ్రోయిన్ వద్ద తాత్కాలిక పనులు చేస్తున్న రైతులు

ఎస్.రాయవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో వరి రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. ధర్మవరం అగ్రహారం వద్ద వరహానదిలో ఉన్న గ్రోయిన్ దెబ్బతినడంతో పలు గ్రామాల్లో పొలాలకు నీరందించే ఎస్.రాయవరం పంట కాలువ వైపు సాగునీరు ప్రవహించడం లేదు. దీంతోటీడీపీ నేత కరణం శివ ఆధ్వర్యంలో పేటసూదిపురం, ఎస్.రాయవరం రైతులు గ్రోయిన్ వద్ద కర్రలు, తాటి దుక్కలను అడ్డుగా వేసి, ఇసుక బస్తాలను పేర్చి.. నీటిని పంట కాలువ వైపు మళ్లించారు. సాగునీటి కోసం రైతులు పడుతున్న పాట్లును చూసిన పలువురు రైతులకు సాగునీటి కష్టాలు ఎప్పటికీ తీరునో అంటూ నిట్టూర్చారు.

ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం



కొర్లయ్యపేటలో ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న తోట నగేశ్

పాయకరావుపేట రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్మన్‌పేట, కొర్లయ్యపేట, వెంకటనగరం, పెంటకోట తదితర మత్స్యకార గ్రామాలలో గురువారం మత్స్యకారులు ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కొర్లయ్యపేటలో జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు ఆధ్వర్యంలో మత్స్యకార యువకులకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు జనసేన నాయకుడు తోట నగేశ్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా నగేశ్ మాట్లాడుతూ మత్స్యకారుల పిల్లలకు మండలంలో రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా కొర్లయ్యపేటలో వైసీపీ నాయకుడు బొడ్డు హరిబాబు ఆధ్వర్యంలో మత్స్యకారులు కేక్ కట్ చేసి మత్స్యకారుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో మత్స్యకారులు, యువకులు పాల్గొన్నారు.

మత్స్యకారులను ఆదుకోవాలి

రాంబిల్లి : సముద్రమే జీవనాధారంగా జీవనం సాగిస్తున్న మత్స్యకార కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని ఫిష్‌కార్న్ నెట్‌వర్క్ ప్రతినిధి అర్జిల్లి దాసు కోరారు. గురువారం వాడపాలెంలో మండల వాడబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.ఈ ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు కావడంతో సముద్రంలో రసాయనాలు కలవడంతో మత్స్య సంపద కనుమరుగైందన్నారు. ఈ సందర్భంగా మత్స్యకార నేతలు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎఫ్‌డీఓ రవితేజకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్.చింతువా మాజీ సర్పంచ్‌ఎరిపల్లి చిట్టిబాబు, మత్స్యకార నేతలు గరికిన అప్పారావు, సూరాడ నూకరాజు, చింతకాయల బాలపరమేశ్వరరావు,సూరాడ వెంకన్న పాల్గొన్నారు.

ఆదరణ పనిముట్లను ఇవ్వండి

నక్కపల్లి: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆదరణ పథకం కింద వేట సామగ్రి, పరికరాల కోసం ఎంతో మంది డీడీల రూపంలో నగదు చెల్లించారని, ఇప్పటికి ఆరేళ్ళ పూర్తయినా అతీగతీ లేదని మత్స్యకారులు ఆవేదన వెలిబుచ్చారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకుని మత్స్యకార సంఘ పెద్దలు గోసల చినతాతారావు, కొవిరి వెంకటేశ్, పిక్కి సత్తియ్య తదితరులు గురువారం ఎంపీడీవో సీతారామరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. ఆదరణ పథకం డబ్బులు గురించి అధికారులు మాట్లాడకపోవడం విడ్డూరంగా వుందన్నారు. ఒకవేళ కూటమి ప్రభుత్వం ఆదరణ పథకాన్ని పునరుద్ధరిస్తే.. గతంలో డీడీలు చెల్లించిన తమ పేర్లు మొదటి జాబితాలో చేర్చాలని, లేదా డబ్బు వాపసు చేయాలని కోరారు. ఈ విషయాన్ని తాను జిల్లా కలెక్టర్, బీసీ సంక్షేమ శాఖాధికారుల దృష్టికి తీసుకువెళతానని ఎంపీడీవో సీతారామరాజు చెప్పారు.

కన్నులపండవగా మరిడిమాంబ జాతర

» జనసంద్రంగా మారిన దార్లపూడి గ్రామం



దార్లపూడిలో మరిడిమాంబ అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

ఎస్.రాయవరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని దార్లపూడి మరిడిమాంబ అమ్మవారి జాతర గురువారం కన్నులపండవగా జరుపుకున్నారు. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. రాత్రికి నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించడానికి అధికసంఖ్యలో జనాలు తరలివచ్చారు. అమ్మవారి ఆలయం వద్ద సాయంత్రం బాణసంచాను పేల్చారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ విభీషణరావు ఆధ్వర్యంలో 35 మందితో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



మరిడిమాంబ జాతరకు హాజరైన జనాలు

అచ్యుతాపురం జంక్షన్‌లో హైమాస్ట్ వెలుగులు



అచ్యుతాపురం జంక్షన్‌లో రంగులతో విరాజిల్లుతున్న హైమాస్ట్ లైట్లు

అచ్యుతాపురం, నవంబరు 21 (ఆన్‌లైన్): అచ్యుతాపురం జంక్షన్ రాత్రి పూట విద్యుత్ వెలుగులతో కళకళలాడుతోంది. జంక్షన్‌లో కనీసం వీధి లైట్లు కూడా ఉండేవి కావు. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. గతంలో ఏపీఐఐసీ పూడిమడక రోడ్డు, అనకాపల్లి రోడ్డులో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. కాని వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్ల ఎప్పుడూ వెలగలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ఏపీఐఐసీ పట్టించుకోలేదు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏపీఐఐసీ జంక్షన్‌లో హైమాస్ట్ లైట్లు వేయడంతో వెలుగులు సంతరించుకున్నాయి.

ఘనంగా జాతీయ ఆయుష్ మిషన్ ప్రోగ్రాం

పాయకరావుపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం జాతీయ ఆయుష్ మిషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోమియో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.పద్మావతి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయుష్ మిషన్ ప్రోగ్రాం కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం వివిధ దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు సంబంధించి చిరువ్యాపారులకు ఆయుష్‌లో అందించే చికిత్సపై అవగాహన కల్పించారు. ఆశా వర్కర్లకు దీర్ఘకాలిక రోగాలు, వాటి నివారణపై ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ డీఎస్.సౌజన్య, ఎంపీహెచ్ఈఓ పీవీ.రమణ, హెచ్ఎస్ ఎం.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మూడు ఆధార్ కేంద్రాలు ఏర్పాటు

మునగపాక, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో మునగపాక, తోటాడ హైస్కూళ్లలోను, గణపర్తి సచివాలయం వద్ద గురువారం ఆధార్ శిబిరాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. ఈ శిబిరాలు ద్వారా ఆధార్ కార్డులో మార్పులు చేసుకోవచ్చునన్నారు. అపార్ పేరుతో ప్రతి విద్యార్థికి ఒక నంబర్ కేటాయిస్తారని, అది ఒకటో తరగతి నుంచి డిగ్రీ వరకు ప్రవేశానికి దోహదపడుతుందన్నారు.

నీటి సంఘాల ఎన్నికలు వాయిదా

పాయకరావుపేట రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 23 వ తేదీన జరగబోయే నీటి సంఘాల ఎన్నికలు డిసెంబరు 8వ తేదీకి వాయిదా వేసినట్టు నీటిపారుదల శాఖ ఏఈఈ జి.శ్రీరామ్మూర్తి తెలిపారు. మండలంలో 7 నీటి సంఘాలకు ఎన్నికలు ఆరోజు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే రెవెన్యూ అధికారుల సహకారంతో నీటిపారుదల శాఖ అధికారులు ఎన్నికలకు ఏర్పాట్లు చేశారు. కూటమి నాయకులు గ్రామాలలో నీటి సంఘాల పరిధిలోని రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి ఎన్నికలకు సిద్ధంగా ఉన్నారు.

న్యాయ విద్యార్థినిపై లైంగిక దాడికి నిరసనగా విద్యార్థుల ర్యాలీ, మానవహారం



పాయకరావుపేటలో మానవహారం నిర్వహించిన విద్యార్థులు

పాయకరావుపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విశాఖలో న్యాయ విద్యార్థినిపై సామూహిక లైంగిక దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.బాలాజీ డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పట్టణంలో ర్యాలీ చేసి, వై జంక్షన్ వద్ద మానహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.బాలాజీ మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. మహిళలు, విద్యార్థులపై ఆఘాయిత్యాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కె.అర్జున్, సింహాద్రి, ఝాన్సీ హేమ తదితరులు పాల్గొన్నారు.

జగ్గన్నపేటలో ధర్మ రక్షా దినోత్సవం

అచ్యుతాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ధర్మ పరిరక్షణ కోసం ఎందరో మహానుభావులు కృషి చేశారని సమరసత సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ కన్వీనర్ టీవీ రమణ అన్నారు. గురువారం జగ్గన్నపేటలో జరిగిన ధర్మ రక్షా దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సంఘ సంస్కర్తలు, సనాతన హైందవ ధర్మదార్శనికులు మన సంస్కృతి, సంప్రదాయాలు, ధర్మ పరిరక్షణకు తీవ్రంగా కృషిచేశారన్నారు. కార్యక్రమంలో కొల్లి అప్పారావు, ఆడారి త్రినాథ్, దొడ్డి కృష్ణ, మళ్ల బుజ్జి, వెంకటలక్ష్మి, గోవింద పాల్గొన్నారు.

నేడు 13 గ్రామాలకు పవర్ కట్

అచ్యుతాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యుత్ వైర్ల కింద చెట్లుకొమ్మలు తొలగిస్తున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. వెదురువాడ, గొర్లె ధర్మవరం, మార్టూరు రోడ్డు, మెట్ట ధర్మవరం, దిబ్బపాలెం, లంక ధర్మవరం, భోగాపురం, మెట్టధర్మవరం, అచ్యుతాపురం, మోసయ్యపేట, మార్టూరు, జంగులూరు, కొనెంపాలెం, దుప్పితూరులకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

రంగనాయకులుకు టీడీపీ నేతల సత్కారం



రంగనాయకులను సత్కరిస్తున్న మంజు, ముసిలినాయుడు

రాంబిల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దూళి రంగనాయకులను హరిపురంలోని నివాసంలో మునగపాక మండల టీడీపీ నేత లు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు, రాష్ట్ర తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి దాడి ముసిలినాయుడు, పలువురు టీడీపీ నేతలు రంగనాయకులను కలిసి సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో సుదర్శన హోమం



సుదర్శన హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక వైభవ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం రెండో రోజు ఆలయ ధర్మకర్త బొలిశెట్టి గోవిందరావు, శారదాకుమారి దంపతుల సమక్షంలో వేద పండితులు సుదర్శన హోమాన్ని నిర్వహించారు. సాయంత్రం ఐదున్నర గంటలకు యాగశాల అర్చన, హోమాలు అనంతరం 1008 తామర పువ్వులతో మహాలక్ష్మి కుంకుమ పూజ చేశారు. భక్తులకు కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు.

తగాదాలో ఆరుగురు కళాసీలకు గాయాలు



కొట్లాటలో తగిలిన గాయం

రాంబిల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్ఈజడ్‌లో కళాసీలు, పూడిమడకకు చెందిన కొందరు వ్యక్తులకు మధ్య జరిగిన తగాదాలో ఆరుగురు కళాసీలకు గాయాలయ్యాయని సీఐ నర్సింగరావు తెలిపారు. ఈనెల 20వ తేదీ సాయంత్రం ఐదున్నర గంటల ప్రాంతంలో అక్కడ పనిచేస్తున్న కళాసీలు, పూడిమడకకు చెందిన కొందరి వ్యక్తుల మధ్య గొడవ జరిగిందన్నారు. సంఘటనలో కళాసీలు రుత్తల సంజీవి, పి.సాంబశివరావు, రుత్తల శ్రీనివాసరావు, రాజాన సురేష్, ఎల్. సత్యరామకృష్ణ, లాలం రమణకు గాయాలయ్యయన్నారు. అందిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్టు సీఐ నర్సింగరావు తెలిపారు.

వెంకటాపురంలో తుప్పలు తొలగింపు



తుప్పలు తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

మునగపాక, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం నుంచి విద్యుత్ సబ్ స్టేషన్ వరకు రోడ్డుకు ఇరువైపులా తుప్పలను గురువారం సర్పంచ్ సుందరపు నీలకంఠస్వామి ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం వహించడంతో ప్రయాణికుల సౌకర్యార్థం తాము తుప్పలు తొలగించే పని మొదలు పెట్టామని ఎంపీటీసీ సభ్యుడు మద్దాల వీరునాయుడు తెలిపారు.

జాతర్లకు సన్నాహాల జోరు

▸▸ గౌరీపరమేశ్వరుల ఉత్సవాలకు సమయం ఆసన్నం ▸▸ ఏర్పాట్లలో తలమునకలైన నిర్వాహకులు ▸▸ ఇప్పటికే పలు ఆలయాల వద్ద విద్యుద్దీపాలంకరణలు



గౌరీ పరమేశ్వరులు



అనకాపల్లిలో విద్యుద్దీపాలంకరణలో వేల్పులవీధి గౌరీ పరమేశ్వరుల ఆలయం

అనకాపల్లి టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గౌరీ పరమేశ్వరుల జాతర్లకు సన్నాహాలు జోరందుకున్నాయి. జిల్లా కేంద్రమైన అనకాపల్లితో పాటు కశింకోట, మునగపాక, హరిపాలెం, చూచుకొండ, ఎలమంచిలి తదితర ప్రాంతాల్లో ఈ వేడుకల నిర్వహణలో భాగంగా ఇప్పటికే ఆలయాల్లో గౌరీ పరమేశ్వరుల ఉత్సవమూర్తులు కొలువుదీరారు. అలాగే పట్టణంలోని పలు ప్రాంతాల్లో బాలగైరమ్మలను ఏర్పాటు చేశారు. ఏటా దసరా పండుగ తర్వాత దీపావళికి ముందు పట్టణంతో పాటు వివిధ ప్రాంతాల్లో గౌరీ పరమేశ్వరుల నిలుపు మహోత్సవాలను చేపట్టడం పూర్వకాలం నుంచి ఆనవాయితీగా వస్తోంది. అదే తరహాలో ఇప్పటికే అనకాపల్లిలోని అమ్మవారి నిలుపు మహోత్సవాలు నిర్వహించారు. వేల్పులవీధి, కుంచావారివీధి, గవరపాలెంలలో ఆది దంపతులను కొలువుదీర్చారు.

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నవంబరు నెలాఖరు నుంచి ఆయా ప్రాంతాల వారి స్థోమతకు తగ్గట్టుగా గౌరీ పరమేశ్వరుల జాతర్లను నిర్వహించేందుకు ఇప్పటికే ఆయల కమిటీలు సన్నద్ధమౌతున్నాయి. శనివారం రోజునే జాతర్లను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగానే అనకాపల్లిలోని గవరపాలెం, వేల్పుల వీధి, కుంచావారివీధి ప్రాంతాల్లోని ఆలయాల్లో ఉత్సవాల నిర్వహణకు సన్నాహాలు ప్రారంభించారు. ఆలయాలను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు.

ప్రత్యేక ఆకర్షణగా విద్యుద్దీపాలంకరణలు

ఈ ఉత్సవాల్లో ప్రత్యేకంగా చెప్పుకునేది విద్యుద్దీపాలంకరణ. గవరపాలెం, వేల్పులవీధి, కుంచావారి వీధితో పాటు కశింకోట, మునగపాక, చూచుకొండ, ఎలమంచిలి తదితర ప్రాంతాల్లోని జాతర్లలో భారీ ఎత్తున విద్యుద్దీపాలంకణ చేపడుతుంటారు. వివిధ రూపాల్లో సెట్‌లు వేస్తుంటారు. గవరపాలెం నిర్వాహకులు గవరపాలెంలోని వీధివీధిన ఈ అలంకరణలు చేపడుతుంటారు. మెయిన్‌రోడ్డులోని సుంకరమెట్ట జంక్షన్ నుంచి చిన నాలుగురోడ్ల జంక్షన్ వరకు, అలాగే వేల్పులవీధి నిర్వాహకులు చిన నాలుగురోడ్ల జంక్షన్ నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా శారదానది వరకు, ఇటు ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి వరకు విద్యుద్దీప కాంతులతో ధగధగలాడేలా ఏర్పాట్లు చేస్తుంటారు. అలాగే కుంచావారి గైరమ్మ గుడి నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా వన్‌వే జంక్షన్ వరకు, అదేవిధంగా రామకృష్ణ థియేటర్ వరకు, ఆలయం నుంచి కన్యకాపరమేశ్వరి గుడి జంక్షన్ వరకు ఏర్పాట్లు చేస్తుంటారు.

ఇక్కడివారు ఎక్కడ స్థిరపడినా జాతరకు హాజరు

ఈప్రాంతానికి చెందిన వారు ఎందరో ఉద్యోగ, వ్యాపార రీత్యా పలుచోట్ల స్థిరపడ్డారు. వీరు సంక్రాంతి పండుగకు రాకపోయినా గౌరీ పరమేశ్వరుల జాతరకు మాత్రం కుటుంబ సభ్యులతో కలిసి ఇక్కడకు విచ్చేస్తుంటారు. జాతరల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పెద్ద సంఖ్యలో బందోబస్తు నిర్వహిస్తుంటారు.

సారె మహోత్సవం ప్రత్యేకత

జాతరలో గౌరమ్మకు సారె సమర్పణ ప్రత్యేకం. ప్రతి ప్రాంతంలో నిర్వాహకులు అమ్మవారి జాతరకు మూడు రోజులు ముందుగా ఈ మహోత్సవం నిర్వహిస్తారు. ఇళ్లలో తయారు చేసిన వివిధ రకాల పిండి వంటలు, పసుపు కుంకుమ, కొబ్బరికాయలు, చీరలు, జాకెట్లు, అరటి పండ్లు తదితరాలు భారీ ఊరేగింపుగా తీసుకు వెళ్లి అమ్మవారికి సమర్పిస్తారు. అనంతరం ప్రసాదంగా కుటుంబ సభ్యులతో పాటు బంధుమిత్రులు ఆరగిస్తారు.

అనకాపల్లిలో వేడుకల తేదీలు ఖరారు

అనకాపల్లి పట్టణంలో డిసెంబరు 21వ తేదీన కుంచావారి గౌరీ పరమేశ్వరులు, జనవరి నెలలో జరిగే సంక్రాంతి పండుగ తర్వాత వచ్చే తొలి శనివారం వేల్పులవీధి, రెండో శనివారం గవరపాలెం గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు నిర్ణయించారు. ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారు.



కుంచావారి గౌరీ పరమేశ్వరుల ఆలయం



గవరపాలెం గౌరీ పరమేశ్వరుల ఆలయం

పంటకోత ప్రయోగాలే దిగుబడి సరళికి ప్రామాణికం

▸▸ జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

▸▸ నారపాడులో పంట కోత ప్రయోగాల పరిశీలన



పంట కోత ప్రయోగాలను పరిశీలిస్తున్న మోహన్‌రావు తదితరులు

సబ్బవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పంటకోత ప్రయోగాలే దిగుబడులు తెలుసుకునేందుకు ప్రామాణికం అని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు అన్నారు. మండలంలోని నారపాడు గ్రామంలో జరుగుతున్న పంట కోత ప్రయోగాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట కోత ప్రయోగాల ద్వారా జిల్లాలో పంట దిగుబడుల సరళిని తెలుసుకోవడం జరగుతుందన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులకు కేటాయించిన వరి పంట కోత ప్రయోగాలను అత్యంత జాగ్రత్తతో, అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని నిర్వహించాలని సూచించారు. ఈ ఏడాది జిల్లాలో వర్షాలు సకాలంలో కురవడం వలన దిగుబడులు ఆశాజనకంగా ఉండే అవకాశం ఉందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రస్తుతం నారపాడులో నిర్వహించిన 5/5 మీటర్ల ప్లాట్లో 20.07 కిలోలు దిగబడి వచ్చినందున సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ, ఏడీఏ వసంతకుమారి, ఏఎస్‌వో రమాదేవి, టాటా ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధి చల్లా వాసు, ఏఏవోలు హరీష్, అప్పారావులతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ అనకాపల్లి మండల కమిటీ ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : యూటీఎఫ్ అనకాపల్లి మండల కౌన్సిల్ సమావేశాన్ని గురువారం సాయంత్రం ఇక్కడ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా బైలపూడి దేవుడునాయుడు, సహాధ్యక్షులుగా కొమ్మోజు సత్యవేణి, సిరసపల్లి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా మామిడి బాబూరావు, ప్రధాన కార్యదర్శిగా నాతవరపు సతీష్, కార్యదర్శులుగా బీవీ సత్యనారాయణ, కురందాసు నారాయణ, పావని, పుర్రె రమణ, ఎం.జగన్నాథం, రవీంద్ర పాత్రుడు, కోశాధికారిగా కృష్ణ కిశోర్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎం.తేజవర్ధన్, మహిళా సబ్ కమిటీ సభ్యురాలుగా పి.పల్లవి, జిల్లా కౌన్సిలర్లుగా ఎం.రాజునాయుడు, ఆర్.అక్కునాయుడు ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులతో జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి ప్రమాణ స్వీకారం చేయించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఆటో బోల్తా

▸▸ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



కల్వర్టులో బల్తాపడిన ఆటో

కొత్తూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఉల్లిపాయల లోడుతో వెళ్తున్న ఆటో బోల్తా పడింది. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా వున్నాయి. నర్సీపట్నం నుంచి పల్లెవెలుగు బస్సు అనకాపల్లి వైపు వస్తున్నది. అనకాపల్లి మండలం పిసినికాడ వద్దకు వచ్చే సరికి ముందు వెళుతున్న ఉల్లిపాయల లోడు ఆటోను ఢీకొన్నది. దీంతో ఆటో పక్కనే ఉన్న కల్వర్టులోకి దూసుకుపోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆటో పూర్తిగా ధ్వంసమైంది. స్థానికులు వెంటనే స్పందించి ఆటో డ్రైవర్‌ను బయటకు తీశారు. చికిత్స నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ప్రమాదానికి సంబంధించి తమకు ఫిర్యాదు రాలేదని అనకాపల్లి రూరల్ పోలీసులు తెలిపారు.

నేత్రపర్వంగా పడమటమ్మ పుట్టుక మహోత్సవం



భక్తుల పూజలందుకున్న అమ్మవారు

కశింకోట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కశింకోటలో పడమటమ్మతల్లి పుట్టుక మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారి ఆలయం నుంచి పల్లకీలో బంతిపువ్వులను ఒక బుట్టలో పెట్టి పసుపు, కుంకుమలతో ఊరేగింపుగా వరి పంట పొలాలు ఉన్న చేనుల్లో నుంచి బయ్యవరం మీదుగా విస్సన్నపేట గ్రామ శివారున ఉన్న పడమటమ్మలోవకు తీసుకు వెళ్లారు. అక్కడ అమ్మవారి ఆలయంలోని పల్లకీని ఉంచి ప్రత్యేక పూజలు జరిపారు. రెండేళ్లకోసారి ఈ పుట్టుక మహోత్సవం రావడంతో భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. కాగా అమ్మవారి పుట్టుక మహోత్సవం సందర్భంగా కశింకోట గ్రామ పురవీధుల్లో మొత్తం 13 స్టేజీలు ఏర్పాటు చేశారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు నేలవేషాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. సీఐ అల్లు స్వామినాయుడు ఆధ్వర్యంలో 200 మందితో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



భక్తులతో కిక్కిరిసిన విస్సన్నపేట గ్రామంలో ఉన్న పడమటమ్మ లోవ

పకడ్బందీగా ఇంటింటి సర్వే

▸▸ వివరాల ఆన్‌లైన్ నమోదులో తప్పిదాలు ఉంటే చర్యలు

▸▸ జిల్లా పంచాయతీ అధికారిణి శిరీషారాణి



బాటజంగాలపాలెంలో సర్వే ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న డీపీవో

సబ్బవరం, నవంబరు 21 : ఇంటింటి సర్వేను పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారిణి ఆర్.శిరీషారాణి ఆదేశించారు. మండలంలోని బాటజంగాలపాలెం సచివాలయం పరిధిలోని ఇంటింటి సర్వే ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను గురువారం ఆమె పరిశీలించి మాట్లాడారు. సర్వేలో సేకరించే వివరాల్లో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. విధి నిర్వహణలో అలక్ష్యం వహిస్తే మెమోలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఆమె అనకపల్లి, పైడివాడ అగ్రహారం, గొల్లలపాలెం గ్రామాల్లోని సంపద కేంద్రాలను పరిశీలించారు. ఈ కేంద్రాల నిర్వహణపై అధికారులు ప్రత్యేక శ్రద్ధచూపాలని ఆదేశించారు. ఆ తరువాత స్వర్ణాంధ్ర సర్వేపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్‌సీ నాగలక్ష్మి, ఈవోపీఆర్‌డీ బి.చైతన్య, సర్పంచ్ పడాల వెంకటరమణ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లా విద్యార్థిని ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలి

▸▸ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన



నిందితులు శిక్షించాలని నినాదాలు చేస్తున్న విద్యార్థులు

అనకాపల్లి టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : న్యాయ విద్యార్థినిపై సామూహిక లైంగిక దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం ఇక్కడి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ మాట్లాడుతూ మహిళా చట్టాలను పటిష్టంగా అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. చట్టాలు చేయడమే కాకుండా వాటిని అమలు చేసే బాధ్యత కూడా తీసుకోవాలని కోరారు. పలువురు యువత మద్యం, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు అలవాటుపడి ఇటువంటి ఘటనలకు పాల్పడుతున్నారని వాపోయారు. లా విద్యార్థినికి జరిగిన అన్యాయంపై నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు కె.అర్జున్, ఎం.వినయ్, వి.బాల, డి.సింహాద్రిలతో పాటు వివిధ విద్యాలయాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ టెలివిజన్ డే



టెలివిజన్ పనితీరును వివరిస్తున్న విద్యార్థులు

అనకాపల్లి టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జాతీయ టెలివిజన్ డేను ఇక్కడి డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించారు. ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో విద్యార్థులు సీహెచ్.చంద్రిక, కె.లాస్యశ్రీ, జి.మానస, డి.సాయిభారతి, డి.లోహిత్‌లు టెలివిజన్ ఆవశ్యకతను చక్కగా వివరించారు. విభాగాధిపతి డాక్టర్ పి.పూర్ణప్రియా మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న సమాచారాన్ని ఎప్పటికప్పుడు టెలివిజన్ ద్వారా తెలుసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎ.నళిని, డాక్టర్ అం జనీకుమార్, ప్రాజెక్టు ఇంజనీర్ బి.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర మాలల మహాగర్జన పోస్టర్ ఆవిష్కరణ

కొత్తూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నం గురజాడ కళాక్షేత్రంలో డిసెంబరు ఎనిమిదో తేదీన జరగనున్న మాలల మహాగర్జన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ గురువారం అనకాపల్లి జీవీఎంసీ జోనల్ కార్యాలయ ప్రాంగణంలో జరిగింది. ఈ సందర్భంగా దళిత సంఘాల నేతలు చిట్ల చలపతి, రేబాక మధు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ ఉత్తరాంధ్ర మాలల మహాగర్జన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. రాజ్యాంగాన్ని కాపాడుకుంటూ ఐక్యతతో రాజ్యాధికారం కోరుకునే ప్రతి ఒక్కరూ మహాగర్జనకు హాజరు కావాల్సిందిగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.అప్పలరాజు, మర్రా చంద్రశేఖర్, తట్టా నాయుడు, గంట్యాడ రమణ, రాజు తదితరులు పాల్గొన్నారు.



మహాగర్జన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దళిత సంఘాల నేతలు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ/సబ్బవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పెదముషిడివాడ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్. రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు లంకెలపాలెం, మంత్రిపాలెం, కన్నూరు, పెదముషిడివాడ, ఈ.మర్రిపాలెం, గొన్నవానిపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని వివరించారు. అలాగే, సబ్బవరం-1, 2 సెక్షన్ల పరిధిలోని 33కేవీ సబ్ స్టేషన్‌లో పనుల కారణంగా శుక్రవారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఈఈ తెలిపారు. రెండు సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల వినియోగదారులు గమనించాల్సిందిగా ఆయన కోరారు.

శివాలయం పునర్నిర్మాణానికి విరాళం



నిర్మాణ కమిటీకి నగదును అందిస్తున్న దాతలు

సబ్బవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరంలో గల పురాతన శివాలయం పునర్నిర్మాణానికి మాజీ ఉప సర్పంచ్ తమరాన వెంకటరమణ కుమారులు మనోజ్, దినేష్ గురువారం రూ.1,08,116లను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వీరిని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు దంగేటి నానాజీ, గెడ్డం కృష్ణ, బర్ల రమణ అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో తమరాన వెంకటరమణ, చింతల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'బల్క్ డ్రగ్ పార్కు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి'

అనకాపల్లి టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నక్కపల్లి ప్రాంతంలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేయాలన్న నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆ ప్రాంతంలో ఇప్పటికే హెట్రో పరిశ్రమ విడుదల చేస్తున్న వ్యర్థాలతో మత్స్యకారుల ఉపాధి దెబ్బతిందని పేర్కొన్నారు. వాయు కాలుష్యం కారణంగా హెట్రో పరిశ్రమ పరిసర గ్రామాల ప్రజలు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని రద్దు చేసే వరకు పార్టీ తరఫున పోరాడుతామని స్పష్టం చేశారు. కాలుష్య రహిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరారు.

విద్యార్థిని అదృశ్యం పై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గవరపాలేనికి చెందిన విద్యార్థిని అదృశ్యమైనట్టు గురువారం పోలీసులకు ఫిర్యాదు అందింది. ఇందుకు సంబంధించి ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపిన వివరాలివి. గవరపాలెం హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న పదహారేళ్ల విద్యార్థిని ఈనెల 19వ తేదీన సాయంత్రం స్కూల్ నుంచి ఇంటికి వచ్చిందన్నారు. అనంతరం బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో తల్లిదండ్రులు వెతికారన్నారు. ఆమె జాడ తెలియకపోవడంతో గురువారం ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి : ఏవో

తుమ్మపాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి రంగాచారి రైతులకు సూచించారు. తుమ్మపాల, సీహెచ్ఎన్ అగ్రహారం, వల్లూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంటపై రెళ్ళు రాల్చే పురుగు ఉందన్నారు. దీని నివారణకు ఎకరాకు పరమెట్రిన్ 400 మిల్లీమీటర్లను పిచికారీ చేయాలని సూచించారు.

యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు భరణికాన బాబూరావుకు పుత్ర వియోగం



రాజేష్ (ఫైల్)

సబ్బవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సీనియర్ నాయకులు, యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు భరణికాన బాబూరావుకు పుత్రవియోగం కలిగింది. ఆయన చిన్న కుమారుడు రాజేష్ (41) గురువారం ఉదయం గుండెపోటుకు గురై మృతి చెందారు. హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో మేనేజర్‌గా పనిస్తున్నారు. అతనికి భార్య, కుమారుడు ఉన్నారు. బాబూరావుకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు కాగా, రాజేష్ చిన్న కుమారుడు. రాజేష్ మృతివార్త తెలుసుకున్న పలు గ్రామాలకు చెందిన నేతలు దేవీపురంలోని బాబూరావు స్వగృహానికి తరలివెళ్లి ఓదార్చుతున్నారు. మృతదేహాన్ని ఇక్కడకు తీసుకొస్తున్నట్టు బంధువులు తెలిపారు. శుక్రవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

వంతెనల వద్ద అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి చర్యలు



భీమవరం వంతెన వద్ద మెటీరియల్ వేసిన కాంట్రాక్టర్

అనంతగిరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరుగుబిల్లి, భీమవరం వంతెనల అప్రోచ్ రోడ్డు పనులు ఏళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోవడంతో రాకపోకలకు గిరిజనులు తీవ్ర ఎదుర్కొనేవారు. వర్షం పడితే బురదమయంగా మారి నడవడానికి కూడా వీలుకాని దుస్థితి. ఈ నేపథ్యంలో గత నెలలోని 'ఆంధ్రజ్యోతి' లో 'అప్రోచ్‌పూర్తికాదు..టెన్షన్ తీరదు' అనే శీర్షికన వెల్లువడిన కథనం వెలువడింది. అలాగే, స్థానిక గిరిజనులు ఐటీడీఏ అభిషేక్ దృష్టికి సమస్యపై వివరించారు. దీంతో పీవో ప్రత్యేక చొరవ తీసుకుని, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులకు పనులు ప్రారంభించేలా ఆదేశాలు జారీ చేశారు. కాంట్రాక్టర్ ద్వారా అప్రోచ్ రోడ్డు పనులను బుధవారం నుంచి ప్రారంభించారు. రెండు, మూడు రోజుల్లో అప్రోచ్‌రోడ్డుకు బీటీ వేస్తామని, ట్రైబల్ వెల్ఫేర్ ఏఈ గణేశ్ తెలిపారు.

తెల్లపిక్కలకు (బొస్తర్లు) గిరాకీ



సంతకు రైతులు తీసుకొచ్చిన తెల్లపిక్కలు

గూడెంకొత్తవీధి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక వారపు సంతలో తెల్లపిక్కలు (బొస్తర్లు) కిలో రూ.150 ధరకు వ్యాపారులు కొనుగోలు చేశారు. గురువారం ఆదివాసీ రైతులు తీసుకువచ్చిన తెల్లపిక్కలను వర్తకులు ఎగబడి కొనుగోలు చేశారు. ఏటా నవంబరు మొదటి వారం నుంచి ఈ పిక్కలను ఆదివాసీ రైతులు వారపు సంతకు తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. జనవరి మొదటి వారం వరకు మార్కెట్‌లో అందుబాటులో ఉంటాయి. ప్రస్తుతం మార్కెట్ ప్రారంభం కావడంతో తెల్ల పిక్కలకు గరిష్ఠ ధర లభిస్తోంది. గత ఏడాది మార్కెట్ ప్రారంభంలో వీటికి కిలో రూ.80 ధర లభించింది. అనంతరం కిలో రూ.50 ధరకు పడిపోయింది. పంట దిగుబడి పెరిగిన కొలదీ ధర తగ్గిపోతుందని ఆదివాసీలుతెలిపారు.

సివిల్స్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

పాడేరురూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సివిల్స్‌లో ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ అందించేందుకు బీసీ, ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ అభ్యర్థులు ఈ నెల 24వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమ సాధికారిత అధికారి ఎం.నర్సింహులు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఏ డైనా డిగ్రీ పూర్తి చేసి ఉండాలన్నారు. 2 పాస్ ఫొటోలు, విద్యా, కుల, ఆదాయ ధ్రు పత్రాలు, ఆధార్, పాన్ కార్డు జతపరిచి ఈ నెల 24వ తేదీలోగా దరఖాస్తులను జిల్లా స్పోర్ట్స్ కార్యాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఉన్న జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో నేరుగా అందించాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు ఫోన్: 81069 99039, 94412 9367లను సంప్రదించాలన్నారు. ఈ నెల 27వ తేదీన అభ్యర్థుల ఎంపిక పరీక్ష ఉంటుందన్నారు. అర్హత పొందిన 100 మంది అభ్యర్థులను ఏపీ స్టడీ సర్కిల్, బీసీ భవన్, విజయవాడలో ఉచిత శిక్షణ ఇస్తారన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకే 'పొలం పిలుస్తోంది'

పెదబయలు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలని ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మారుమూల ఇంజరి పంచాయితీ మల్లెపుట్టు గ్రామంలో రైతులతో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సభను ఏర్పాటు చేసి వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరాలు తెలియజేశారు. ఆధార్ నవీకరణ ప్రాముఖ్యత , చిరుధాన్యాల ఆవశ్యకత, వ్యవసాయ యాంత్రీకరణ, సహజ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. క్షేత్ర స్థాయిలో వరి పంటను పరిశీలించారు. ఆకుముడత, కంకినల్లి తెగుళ్ల నివారణకు పలు సూచలందించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు కె. సుభాకర్, గ్రామ సచివాలయ సిబ్బందిరైతులు పాల్గొన్నారు.

వాణిజ్య పంటలతో ఆర్థిక పురోభివృద్ధి: ఏవో

ముంచంగిపుట్టు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పంటలతో రైతులు ఆర్థికంగా వృద్ధి చెందుతారని ఏవో ఎం.శ్రీనివాసబాబు అన్నారు. మండలంలోని బరడ పంచాయితీ అంటబొంగు గ్రామంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయంలో పాటించాల్సిన పద్ధతులు, దిగుబడి కోసం తీసుకోవల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పార్వతమ్మ, ఎంపీటీసీ నబ్బో, ఎంపీఈవో లోకేష్, పశు వైద్య సహాయకులు అప్పలరాజు తదితరులున్నారు.

తీగలమెట్ట రహదారికి మోక్షమెన్నడో?

» ఐదేళ్లుగా నిలిచిన నిర్మాణ పనులు
» అవస్థలు పడుతున్న ఐదు గ్రామాల ప్రజలు



గ్రావెల్ పరచి అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు

కొయ్యూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీగలమెట్ట అసంపూర్తి రహదారి నిర్మాణానికి మోక్షం లభించలేదు. గ్రామానికి చెందిన యువజన నాయకుడు రంజిత్‌కుమార్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టరుకు గత నెలలో ఈ రోడ్డు సమస్యపై ఫిర్యాదు చేశారు. దీంతో పెండింగ్ బిల్లులు మంజూరుకు కలెక్టరు చొరవ చూపటంతో రహదారి నిర్మాణాలు ఎట్టకేలకు అడ్డంకులు తొలగాయని స్థానికులు ఎంతో సంబరపడ్డారు. అయితే, రహదారి పనులు పునఃప్రారంభానికి కాంట్రాక్టరు చొరవ చూపకపోవటంతో ఈ మార్గంలోని ఐదు గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. చింతపల్లి వెళ్లే ప్రధాన రహదారినుంచి దిబ్బలవీధి మీదుగా తీగలమెట్టను కలుపుతూ గాంకొండకు రహదారి నిర్మాణపనులు గడిచిన ఐదేళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయాయి. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఉపాధి పథకం నిధులు నుంచి మెటల్‌రోడ్డు నిర్మాణానికి రూ. 1 కోటి మంజూరైంది. అనంతరం ఎన్నికలు రావడంతో నిర్మాణాలకు అంతరాయం కలిగింది. ఎన్నికలైన ఆరు నెలల తర్వాత మట్టి పనులు పూర్తిచేశారు. ఇందుకు గానూ 2020 ఫిబ్రవరిలో పార్టు బిల్లుగా రూ. 22 లక్షలు చెల్లింపులు జరిపారు. కాంట్రాక్టర్ మిగిలిన పనులకు అవసరమైన మెటల్ ఈ నాలుగు కిలోమీటర్లు పొడవున కుప్పలు పోశారు. అ నంతరం గాంకొండ నుంచి తీగలమెట్ట వరకు మెటల్ పరిచారు. మిగిలిన నిర్మాణానికి చర్యలు చేపడుతుండగా గత వైసీపీ ప్రభుత్వం ఈ పనులను వర్కు ఐడీ హోల్డ్‌లో పెట్టింది. దీంతో ఇంజనీరింగ్ అధికారుల సూచనలతో కాంట్రాక్టర్ పనులు అర్ధాంతరంగా నిలిపేశారు. రాజకీయ వివక్షతో నిబంధనకు విరుద్ధంగా పనులు నిలిపివేయడంపై సర్వ త్రా విమర్శలు వినిపిం చాయి.. ఇది జరిగి మూడు సంవత్సరాలవుతున్నా ఇంజనీరింగ్ అధికారులు చర్యలు లేవు. దీంతో ఈ రహదారిలో ప్రయాణించే ఐదు గ్రామాల ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. గత అక్టోబరులో తీగలమెట్టకు యువజన నాయకుడు రంజిత్‌కుమార్ కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ పెండింగ్ బిల్లులు మంజూరు హామీ తోపాటు రోడ్డు నిర్మాణాలు చేపట్టేలా సంబంధిత ఇంజనీరింగ్ అధి కారులకు ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీ కార్యదర్శి ద్వారా ఫిర్యాదు చేసిన యువకునికి ఈ కాపీ అందచేశారు. ఇది జరిగి సుమారుగా రెండు నెలలవున్నా రహదారి నిర్మాణ పనులు ప్రారంభించలేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కలెక్టరు ఆదేశాలను బేఖాతరు చేయడంపై మండిపడుతున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ జేఈ రామకృష్ణ వద్ద ప్రస్తావించగా, కాంట్రాక్టర్ నిలిపేసిన రోడ్డు పూర్తికి ముందుకురావటం లేదన్నారు. దీంతో పనులు వేరొకరితో పూర్తి చేయించేలా పంచాయతీ తీర్మానం తీసుకుని త్వరలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.



కాంట్రాక్టర్‌కు బిల్లులు మంజూరు పత్రం చూపుతున్న దృశ్యం

కాఫీ పండ్ల కొనుగోలు లక్ష్యాన్ని సాధించండి: పీవో



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్, పక్కన ఏపీవో వెంకటేశ్వరరావు

పాడేరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గిరిజన రైతుల నుంచి కాఫీ పండ్ల కొనుగోలుకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశించారు. ఈ ఏడాది కాఫీ కొనుగోలుపై కాఫీ విభాగం అధికారులు, చింతపల్లి మాక్స్ సొసైటీ ప్రెసిడెంట్, బోర్డు డైరెక్టర్లతో గురువారం ఐటీడీఏలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ పదకొండు మండలాల వ్యాప్తంగా రెండు వేల టన్నులకు తగ్గకుండా కాఫీ పండ్లు కొనుగోలు చేయాలన్నారు. వాటి ద్వారా 350 టన్నుల పార్చ్‌మెంట్‌ను ఉత్పత్తి చేయాలని పేర్కొన్నారు. అందుకు గానూ మాక్స్ సంస్థ బోర్డు డైరెక్టర్ల సంఖ్యను పెంచి పదకొండు మండలాలకు విస్తరించి, రైతులకు భాగస్వామ్యం కల్పించామన్నారు. కాఫీ సేకరణలో బోర్డు డైరెక్టర్లు కీలక పాత్ర పోషించాలని, కాఫీ పండ్ల రవాణా వాహనాలకు మండలాలు, దూరాన్ని దృష్టిలో పెట్టుకునిరవాణా చార్జీలను నిర్దేశించామన్నారు. వాహనాలను అద్దెకు తీసుకోవాలని, నిర్దేశించిన మేరకు రవాణా చార్జీలు చెల్లిస్తామన్నారు. గతేడాది కిలో కాఫీ పండ్లకు తొలుత రూ.43 చెల్లించి, వాటి విక్రయాల అనంతరం మరో రూ.3 బోనస్ అందించామన్నారు. ఈ ఏడాది కిలోకు రూ.44 ధరను రైతులకు చెల్లించడానికి నిర్ణయిం చామని, 60 శాతం పండ్ల కొనుగోలు డిసెంబరు నాటికి పూర్తి చేయాల న్నారు. పాత కాఫీతోటల పునరుద్ధరణకు 400 మొక్కలు ఉన్న తోటలను గుర్తించాలన్నారు. ఈ సమావేశంలోఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వరరావు, కాఫీ ఏడీ ఎన్.అశోక్,మాక్స్ సంస్థ అధ్యక్షుడు సెగ్గె కొండలరావు, ఉపాధ్యక్షుడు జి. సింహాచలం, కాఫీ,ఉద్యానసిబ్బంది,మాక్స్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రెజ్లింగ్‌లో డిగ్రీ కళాశాల విద్యార్థులకు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

పాడేరురూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో ఈ నెల 9, 10 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాడేరు డిగ్రీ కళాశాల విద్యార్థులు పలు పతకాలను సాధించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్.వనుము చిట్టబ్బాయి, వైస్‌ప్రిన్సిపాల్ డ్యార్.టీఎస్ రసూల్ తెలిపారు. కళాశాలలోని ద్వితీయ సంవత్సరం బీకాం విద్యార్థి జి.అశోక్, ప్రథమ సంవత్సర బీఏ స్పెషల్ తెలుగు విద్యార్థి పి.బుజ్జిబాబు గోల్డ్ మెడల్స్‌ను సాధించారన్నారు. అలాగే, ద్వితీయ సంవత్సర బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ విద్యార్థిని కె.దేవమ్మ, ద్వితీయ సంవత్సర బీఏ విద్యార్థి జి.రమణబాబు కాంస్య పథకాలను సాధించినట్టు చెప్పారు. గురువారం కళాశాలకు వచ్చిన ఈ విద్యార్థులను ఐక్యూ కో-ఆర్డినేటర్ పి.కోటేశ్వరరావు, అధ్యాపకులు వి.రమేశ్‌బాబు, డి.గణేశ్, జి.దామోదరరావు, జి.గౌరీశంకరరావు, ప్రసాద్‌నాయుడు, అప్పలనాయుడు, కొత్తంనాయుడు అభినందించారు.

పర్యాటక ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగు పరచాలి

చింతపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగు కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు కోరారు. గురువారం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావుని టీడీపీ నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈసందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ సీజన్ ప్రారంభం కావడంతో లంబసింగి, తాజంగి ప్రాంతాలకు అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తున్నారన్నారు. దీంతో పారిశుధ్య సమస్య తలెత్తుందన్నారు. ఈ ప్రాంతాల్లో మంచి వాతావరణం కల్పించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, నాయకులు రీమల ఆనందరావు, అబ్బాయినాయుడు, లక్ష్మణ్, మహేంద్ర, అర్జున్, మంగ్లు, అప్పారావు, గంగరాజు, పడాల సతీశ్, చిన్న, వల్లి, గాంధీ పడాల్, సర్పంచ్ సాగిన వరలక్ష్మి పాల్గొన్నారు.

కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌కు సత్కారం



పీవీజీ కుమార్‌ని సత్కరిస్తున్న కూటమి నాయకులు

చింతపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ కొప్పల వెలమ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన పీవీజీ కుమార్‌ని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. గోవింద్, వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి పెడిరెడ్ల బేతాళుడు, చింతపల్లి కూటమి నాయకులు గురువారం గొల్లపూడి బీసీ సంక్షేమ భవనంలో పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ టీడీపీలో కష్టపడిన వారికి సుముచిత స్థానం లభించినట్టు పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు నామినేటెడ్ పోస్టుల్లో సమన్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు దూనబోయిన రమణ, ఇండుగ శేఖర్ పాల్గొన్నారు.

పాడేరురూరల్: విజయవాడలో గురువారం ప్రమాణం స్వీకారం చేసిన రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్, గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్రలను పాడేరు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు డప్పోడి వెంకటరమణ (బుజ్జి), నియోజకవర్గ ఐటీడీపీ ఇన్‌చార్జి బుద్ద జ్యోతికిరణ్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వారిని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని మండలాలివే..

పాడేరురూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని ఫీడర్ల మరమ్మతులు చేపడుతున్నందున ఈనెల 22వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జి.మాడుగుల, పాడేరు మండలాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు పాడేరు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏపీఎస్ఎం అప్పారావు తెలిపారు. పాడేరు నుంచి జి.మాడుగుల వరకు హైవే రోడ్డు విస్తరణ పనులు నేపథ్యంలో ఈ మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. పాడేరు సబ్ స్టేషన్‌లో 11 కేవీ బొక్కెళ్లు ఫీడర్‌లో మరమ్మతుల చేపడుతున్నందున బొక్కెళ్లు, ఇరడాపల్లి, వంజంగి, కించూరు, దోకులూరు, డి.గొందూరు, బడిమెల గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

స్వర్ణ పంచాయతీ డేటా నమోదు వేగవంతం: డీఎల్‌పీవో



మాట్లాడుతున్న డీఎల్‌పీవో పీఎస్ఎస్ కుమార్

చింతపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్వర్ణ పంచాయతీ డేటా నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని పాడేరు డీఎల్‌పీవో పీఎస్ఎస్ కుమార్ సూచించారు. గురువారం చింతపల్లి, చౌడుపల్లి గ్రామ పంచాయతీలను ఆయన తనిఖీ చేశారు. ఆధార్ కేంద్రాల నిర్వాహణను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ స్వర్ణ పంచాయతీలో భాగంగా ప్రతి గృహం వివరాలను ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేయాలని కార్యదర్శులకు సూచించారు. ఎన్‌పీసీఐ బ్యాంక్ లింకేజీలను చేయించాలన్నారు. వివిధ పథకాల లబ్ధిదారుల ఆధార్, బ్యాంక్ ఖాతాను అనుసంధానం చేయాలన్నారు. దీని వల్ల ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారుని ఖాతాలో జమ అవుతాయన్నారు. హౌస్ జియోట్యాంగింగ్ చేపట్టాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకుచర్యలు తీసుకోవాలన్నారు.ఈకార్యక్రమంలో ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు, కార్యదర్శి శ్రీధర్, గుమస్తా అంబేడ్కర్ పాల్గొన్నారు.

ఐటీడీఏ గ్యాస్ కార్యాలయంలో అక్రమాలపై విచారణ

పాడేరురూరల్, నవంబరు 21: పాడేరులోని ఐటీడీఏ గ్యాస్ కార్యాలయంలో అక్రమాలపై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కూడా భాస్కరరావు గురువారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్ల లబ్ధిదారులు ఈకేవైసీ చేసుకోవాల్సి ఉందని తెలిపారు. అయితే, ఈకేవైసీకి వచ్చే వారికి గ్యాస్‌పైపు విధిగా కొనుగోలు చేయాలంటూ రూ. 100 ధర గల పైపును రూ. 200కు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయంపై ఐటీడీఏలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఈ నేపథ్యంలో ఆర్‌ఐ చేపట్టారన్నారు. ఈ సందర్భంగా విచారణాధికారికి బాధితులతో వాంగ్మూలం ఇచ్చినట్టు చెప్పారు. అధికారులు స్పందించి లబ్ధిదారుల నుంచి అదనంగా వసూలు చేసిన నగదును తిరిగి చెల్లించేలా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వో జి.రవికుమార్ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

» ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్



పెదబయలులో ర్యాలీ చేపడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు,విద్యార్థులు

పెదబయలు, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి): ఆశ్రమ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా నాయకులు కార్తీక్, శ్రీను డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పెదబయలులోని వివిధ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులతో కలిసి స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల మైదానం నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ కూడలి వద్ద మానవహారం చేపట్టారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఆ శ్రమ పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంలో ఐటీడీఏ అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు .పిల్లర్ దశలో నిర్మాణం నిలిచిన స్థానిక జడ్పీ పాఠశాల భవనాలను సత్వరమే పూర్తి చేయాలన్నారు. అదనపు భవనాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. హాస్టల్ విద్యార్థులకు వసతి కరువైందన్నారు. జడ్పీ పాఠశాలకు ప్రత్యేక హాస్టల్ ఏర్పాటు చేసి వార్డెన్‌ను నియమించాలని అన్నారు. విద్యార్థులకు స్వెట్టర్లు ఉచితంగా పంపిణీ చేయాలని కోరారు. చలికాలం కావడంతో స్నానానికి, తాగటానికి వేడి నీటిని అందించాలన్నారు. ఇటీవల విద్యార్థుల మరణాలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. హెల్త్ వర్కర్, వాచ్‌మేన్‌లను నియమించాలన్నారు. శిథిలావస్థకు చేరిన భవనాలకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. విద్యార్థులకు యూనిఫారాలను ప్రభుత్వమే అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రవీణ్, రాకీ, బిందు, విదార్థులు తదితరులు పాల్గొన్నారు.

తప్పని డోలీ మోతలు!

» దబ్బగరువుకు చెందిన అనారోగ్య బాధితురాలి తరలింపులో అష్టకష్టాలు



వాంతులు విరేచనాలతో బాధపడుతున్న మహిళను డోలీలో తరలిస్తున్న దృశ్యం

పాడేరురూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వాలు మారుతున్నా గిరిజనులకు రహదారి కష్టాలకు తీరడంలేదు. సలుగు పంచాయతీ దబ్బగరువు గ్రామంలోని కిత్తులమామిడివీధికి చెందిన జర్తా సైలు అనే యువతి గురువారం ఉదయం వాంతులు, విరే చనాలతో తీవ్ర అస్వస్థతకు గురైం ది. దీంతో అత్యవసర వైద్య సేవల కోసం సమీపంలోని ఈ దులపాలెం పీహెచ్‌సీకి డోలీ మోతతో ఆమెను కుటుంబ సభ్యులు తరలించారు. తమ గ్రామానికి రహదారి సౌకర్యం లేక పోవడంతో ఐదు కిలోమీటర్లు దూరం కొండగుట్టలపైనుంచి డోలీపై మోసుకు రావాల్సి వచ్చినట్టు బాధితురాలి కుటుంబ సభ్యులు జర్త ఈశ్వరరావు, మహేష్ నగేష్ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామానికి గతంలో రహదారి మంజూరైనా అటవీ శాఖ ఆంక్షలతో నిర్మాణ పనులు నిలిచిపోయాయయన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత గిరిజనులు కోరుతున్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై వినతి



సీలేరులో జెన్‌కో ఎస్ఈకి వినతి పత్రమిస్తున్న కాంట్రాక్టు కార్మికులు

సీలేరు, నవంబరు 21: ఏపీ జెన్‌కో, ట్రాన్స్‌కోల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను సంస్థల్లో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సీఐటీయూసీ) సీలేరు బ్రాంచి నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక జెన్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రాన్ని గురువారం అందజేశారు. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, 2022 పీఆర్‌సీ ప్రకారం వేతనాలు, ఏరియర్స్ వెంటనే చెల్లించాలని కోరారు. పదేళ్ల సర్వీసు పూర్తయిన ప్రతీ కార్మికుడికి 2018 ముందుప్రభుత్వం ఇచ్చిన విధం గా హై స్కిల్డ్ కార్మికుడికి రూ. 1000, స్కిల్డ్ కార్మికుడికి రూ. 800, అన్‌స్కిల్డ్ కార్మికుడికి రూ. 500 ఇన్సెంటివ్‌లు ఇవ్వాలని కోరారు. సీలేరు, డొంకరాయి జలవిద్యుత్ కేంద్రాల్లో 85 మంది విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారు. వీరికి ఏపీ జెన్‌కో ఆధ్వర్యంలో నడుపుతున్న భవ్య హెల్త్ క్లీనిక్ ఆసుపత్రిలో ఎటువంటి వైద్య సేవలను అందించడం లేదనివాపోయారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూసీ సీలేరు బ్రాంచి కాంట్రాక్టు కార్మికుల గౌరవ అధ్యక్షుడు ఎస్‌కే సుభాన్, అ ధ్యక్షుడు బీ లక్ష్మణరావు , కార్యదర్శి టీ విష్ణుకుమార్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధి పనుల సమాచారం ప్రజాప్రతినిధులకు తెలియజేయండి'

గూడెంకొత్తవీధి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల సమాచారం ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులకు తెలియజేయాలని స్థానిక ఎంపీడీవో వై. ఉమామహేశ్వరరావు సూచించారు. గురువారం తన కార్యాలయంలో ఎంపీపీ బోయిన కుమారి అధ్యక్షతన అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే ఉపాధి పథకం పనులు, పంచాయతీ, మండల పరిషత్ నిధులతో చేపడుతున్న అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతర రహదారులు, పక్కా గృహాల నిర్మాణాల్లో ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులను భాగస్వామ్యం చేయాలన్నారు. పంచాయతీలో చేపట్టే ప్రతి అభివృద్ధి పనులపై గ్రామ సభ పెట్టి ప్రజలకు వివరించాలన్నారు. ఈకార్యక్రమంలో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈలు జ్యోతిబాబు, కల్యాణ్‌రామ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

థాంగ్ టా మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థినుల ప్రతిభ



పతకాలతో ఐశ్వర్య, దేదీప్య

అరకులోయ,నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): థాంగ్ టా మార్షల్ ఆర్ట్స్‌లో అరకులోయ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న బాలిక సోనాయ్ ఐశ్వర్య మొదటి స్థానం, 8వతరగతి విద్యార్థిని దేదీప్య ద్వితీయ స్థానం సాధించినట్టు పాఠశాల పీడీ సూరిబాబు తెలిపారు. ఇటీవల పాడేరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు సత్తా చూపి జాతీయస్థాయి పోటీల్లో అర్హత సాధించారన్నారు. ఈ సందర్భంగా బాలికలను పాఠశాల హెచ్ఎం మోహనరావు, ఉపాధ్యాయులు అభినందించారు. జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

బీజేపీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న జీసీసీ డైరెక్టర్ రాజారావు

డుంబ్రిగుడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జీసీసీ డైరెక్టర్‌గా నియమితులైన బీజేపీ నేత పాంగి రాజారావు డుంబ్రిగుడలో గురువారం పర్యటించారు. అనంతరం స్థానిక పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యా రు. పార్టీ బలోపేతానికి సభ్యత్వాలను వేగవంతం చేయాలన్నారు. కష్టపడిన వారికి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. పార్టీ సభ్య త్వం పొందిన వారికి బీమా వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గాసి, సుబ్బారావు, రవి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

అరకులోయ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్క విద్యార్థీ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని స్థానిక డి గ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.భరత్ కుమార్‌నాయక్ అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఇందులో భాగంగా నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన, క్విజ్ పోటీల విజేతలకు ప్రిన్సిపాల్ గురువారం బహుమతులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు.కళాశాల లైబ్రరీ ఇన్‌చార్జి కొండబాబు మాట్లాడుతూ రోజూ పత్రికలను చదవాలన్నారు. వైస్‌ప్రిన్సిపాల్ డా.కె.పుష్పరాజ్ గ్రంథాలయాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ కామేశ్వరరావు, అధ్యాపకులు డా.కృష్ణమోహన్, ఎల్.ఎం.ఎస్ గణేశ్, సుందరిరాణి, ఎన్ఎస్ఎస్ పీవోలు విజయలక్ష్మి, అనితకుమారి,రాజు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఆసరా

కొయ్యూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపూడిలో అగ్ని ప్రమాద బాధిత కుటుంబాన్ని గురువారం తెలుగుదేశం పార్టీ నేతలు పరామర్శించారు. నగదుతోపాటు నిత్యావసర సరకులు, వస్త్రాలు అందచేశారు. బుధవారం గ్రామంలో పుట్టా సత్యనారాయణకు చెందిన పూరిల్లు దగ్ధమై సుమారు రూ.5 లక్షలు మేర ఆస్తి నష్టం వాటిల్లిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రామ్మూర్తి, తెలుగు మహిళ మండల నేత శ్యామల వరలక్ష్మి గ్రామానికి వెళ్లి జరిగిన నష్టాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబానికి సాయం అందించారు. ప్రభుత్వం ఆదుకునేలా అధికారులతో మాట్లాతామని వారు హామీ ఇచ్చారు.

గంజాయి పంటను ధ్వంసం చేయాలి: ఎస్ఐ

ముంచంగిపుట్టు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గంజాయి సాగు చేస్తున్నట్లయితే, స్వచ్ఛందంగా ఆ పంటను ధ్వంసం చేయాలని ఎస్ఐ జె.రామకృష్ణ హెచ్చరించారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండల పరిధిలో గంజాయి ఎక్కడ సాగుజరుగుతుందో అనే సమాచారం తమ వద్ద ఉందని, ఈ సాగు చేస్తున్న వారు స్వచ్ఛంగా పంటను ధ్వంసం చేయాలన్నారు. లేకుంటే వారిపై ఎన్‌డీపీఎస్ చట్ట ప్రకారం తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి సాగుపై ఎవరికైనా సమాచారం తెలిస్తే తమకు అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు.

డి.పట్టా భూములను పక్కాగా గుర్తించండి

▸▸ వీఆర్‌వోల సమావేశంలో తహసీల్దార్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రామరావు

మాకవరపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో డి.పట్టా భూములను పక్కాగా గుర్తించాలని వీఆర్‌వోలకు తహసీల్దార్ ఎల్.రామరావు ఆదేశించారు. గురువారం ఇక్కడ ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ అసైన్‌మెంటు జాబితా ప్రకారం డి.పట్టా భూముల్లో పట్టాదారుడు ఉండాలని లేనిపక్షంలో ఆయన వారసుడు ఉండవచ్చునన్నారు. ఇతరులు ఉంటే అలాంటి భూమిని పీవోటి పెట్టి స్వాధీనం చేసుకోవాలన్నారు. కార్యాలయంలో వీఆర్‌వోలు కూర్చొని జాబితా తయారు చేయకుండా భూమి దగ్గరకు తప్పనిసరిగా వెళ్లి గుర్తించి తీరాలని స్పష్టం చేశారు. రెండు రోజుల్లో సదరు నివేదిక అందజేయాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ స్టేడియంలో అభివృద్ధి పనులు

▸▸ అంచనాలు సిద్ధం చేయాలని డీఈఈకి కమిషనర్ ఆదేశం



స్టేడియంలో డీఈఈతో మాట్లాడుతున్న కమిషనర్ సురేంద్ర

నర్సీపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియం ముందు భాగంలో ప్రహరీగోడ, మైదానంలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా, డ్రైనేజీ కాలువ, వాకింగ్ ట్రాక్ మరమ్మతులు, భవనం మరమ్మతులకు అంచనాలు సిద్ధం చేయాలని నర్సీపట్నం కమిషనర్ సురేంద్ర మునిసిపల్ డీఈఈ కామేశ్వరరావుకు సూచించారు. ఈ మేరకు గురువారం స్టేడియంలో పర్యటించి సమస్యలు, చేపట్టాల్సిన పనులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిపాదనలు సిద్ధం చేస్తే స్పీకర్ అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకువెళతామన్నారు.

లా విద్యార్థిని ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలి

నర్సీపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నంలో న్యాయ విద్యార్థినిపై జరిగిన దుర్ఘటనకు నిరసనగా గురువారం ఇక్కడ విద్యార్థులు మానవహారం నిర్వహించారు. అబీద్ సెంటర్‌లో ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో ఈ ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంతటి ఘాతుకానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జనార్థన్, భూషణ్‌రావు, ఐద్వా నాయకురాలు సూర్యప్రభ, గౌరీలతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు.

బడుల్లో భయం.. భయం..

▸▸ శిథిలావస్థలో పలు గ్రామాల్లోని పాఠశాలల భవనాలు ▸▸ పట్టించుకోని అధికారులు ▸▸ పిల్లలను చదువులకు పంపాలంటే తల్లిదండ్రులు హడల్



శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం



ఎరకన్నపాలెం పాఠశాలలో శ్లాబ్ నుంచి పెచ్చులూడి పడిన దృశ్యం

మాకవరపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎరకన్నపాలెం, సుభద్రయ్యపాలెం, జెడ్.గంగవరం, వెంకయ్యపాలెం, తాడపాల, ముషిడిపాలెం, చామంతిపురం, మల్లవరం తదితర గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల భవనాలు ఈ దుస్థితిలో ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఎరకన్నపాలెంలో ఉన్న పాఠశాల భవనం దుస్థితి మరీ దారుణంగా ఉంది. ఇక్కడి గదుల్లో శ్లాబ్ నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో ఉపాధ్యాయులు ఎప్పుడు ఏం జరుగుతుందోనని భావించి విద్యార్థులను బయట వరండా గదుల్లో కూర్చొబెట్టి తరగతులను నిర్వహిస్తున్నారు. అలాగే వెంకయ్యపాలెం పాఠశాలలో మూడు, నాలుగు తరగతులకు చెందిన ఇద్దరు మాత్రమే ఉన్నారు. ఇక్కడి పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. అలాగే, తాడపాల గ్రామంలో ఉన్న పాఠశాల భవనం వర్షం వస్తే కారిపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కురిసిన వర్షాలకు పాఠశాల భవనంలోకి నీరు చేరిన సంఘటనలు ఉన్నాయని అంటున్నారు.. జెడ్.గంగవరం పాఠశాల దుస్థితి కూడా ఇదే తరహాలో ఉంది. ఇక్కడ కూడా విద్యార్థులు బితుకు బితుకుమంటూ చదువులు సాగిస్తున్నారు. అలాగే మల్లవరంలో ముగ్గురు విద్యార్థులు ఉన్నారు. ఉన్న ఒక్క తరగతి గది పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఇక శెట్టిపాలెంలో విద్యార్థుల సంఖ్య బాగా ఉన్నప్పటికీ ఇక్కడ కూడా పాఠశాల భవనం భయపెడుతోంది. చామతిపురం పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో పక్కనే ఉన్న పాల కేంద్రం భవనంలో తరగతేలపే నిర్వహిస్తున్నారు. మండలంలోని ఆయాపాఠశాలల భవనాలు ఇంత దారుణంగా ఉండడంతో పిల్లలను చదువులకు పంపాలంటేనే తల్లిదండ్రులు హడలిపోతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి, శిథిల భవనాల స్థానే పక్క భవనాలను నిర్మించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

టిడ్కో గృహాలకు తాగునీటి సరఫరాకు సన్నాహాలు

▸▸ ఉత్తరవాహిని వద్ద వరహా నదిని పరిశీలించిన అధికారులు ▸▸ నీటి వనరుల లభ్యతపై ఆరా



ఉత్తరవాహిని వద్ద నీటి వనరులను పరిశీలిస్తున్న ఎస్ఈ డీఎస్ మూర్తి, కమిషనర్ సురేంద్ర తదితరులు

నర్సీపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి బలిఘట్టం, బయపురెడ్డిపాలెం కొమి రోడ్డులో నిర్మించిన ఏపీ టిడ్కో గృహాలకు తాగునీటి సరఫరా పథకం నిర్మాణానికి అవసరమైన నీటి వనరుల లభ్యత కోసం బలిఘట్టం ఉత్తరవాహిని వద్ద వరహా నదిని అధికారులు పరిశీలించారు. ఏపీ టిడ్కో సూపరింటెండెంట్ ఇంజనీర్ డీఎస్ మూర్తి, పబ్లిక్ హెల్త్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.శ్రీనివాసరావు గురువారం ఇక్కడకు విచ్చేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ సురేంద్రను ఇక్కడ నీటి లభ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్ఈ డీఎస్ మూర్తి విలేకరులతో మాట్లాడుతూ బలిఘట్టం, బయపురెడ్డిపాలెం కొమి రోడ్డులో నిర్మించిన టిడ్కో గృహాలకు రూ.5.5 కోట్లతో తాగునీటి పథకం నిర్మాణం చేయనున్నట్టు తెలిపారు. తొలుత బయపురెడ్డిపాలెం వద్ద వరహానది నుంచి పైపు లైన్ వేద్దామని ఆలోచించామని, అయితే అక్కడ ప్రజలు, రైతులు అభ్యంతరం తెలిపారన్నారు. ఉత్తర వాహిని దగ్గర వరహానది నుంచి నీటి సరఫరాకు అవకాశాలను పరిశీలిస్తున్నామని వివరించారు. టిడ్కో గృహాలు చాలా వరకు పూర్తయ్యాయని, మౌలిక సదుపాయాల పనులు కాంట్రాక్టర్ వలన ఆలస్యం జరిగిందని తెలిపారు. త్వరలో ఈ పనులు కూడా పూర్తి చేస్తామని వివరించారు.

నాతవరంలో విద్యార్థులు శ్రమదానం



పరిశుభ్రతపై ప్రచార ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నాతవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం నాతవరంలో మల్లారెడ్డి విశ్వవిద్యాలయం విద్యార్థులు గురువారం శ్రమదానం చేశారు. వాటర్, శానిటేషన్, హైజిన్ (వాష్)పై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పారిశుధ్య కార్మికులతో కలిసి పార్కులు, ఇతర పబ్లిక్ ప్రదేశాలలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. పది రోజులపాటు నాతవరం మండలంలోని వివిధ పంచాయతీలలో పర్యటించి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్టు చెప్పారు.

ఘనంగా మరిడిమాంబ పండుగ



పూజలందుకున్న అమ్మవారు

మాకవరపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : తామరం గ్రామంలో మరిడిమాంబ పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం ఏర్పాటైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నిర్వాహక కమిటీ సభ్యులతో పాటు గ్రామ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పేదలకు వస్త్రదానం

నర్సీపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సత్యసాయి బాబా జయంత్యుత్సవం సందర్భంగా గురువారం దోనెపాలెం గ్రామంలో పేదలకు వస్త్ర దానం చేశారు. తొలుత సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నగర కీర్తన నిర్వహించారు. అనంతరం 30 మంది పేదలకు వస్త్రదానం, గర్భిణులకు సీంతాలు జరిపారు. కన్వీనర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారం

మాడుగుల రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎం.కోడూరు జడ్పీ హైస్కూల్‌లో గత మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు గురువారం నగదు పురస్కారం అందించారు. ఎం.కోడూరుకి చెందిన గొల్లవిల్లి నాగమణి ఆమె భర్త గొల్లవిల్లి వరహామూర్తి జ్ఞాపకార్థం అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు మొదటి బహుమతిగా రూ10వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 5వేలు, తృతీయ బహుమతిగా రూ.3వేలు అందించారు. ఎస్ఎంసీ చైర్మన్ అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గవర కార్పొరేషన్ డైరెక్టర్‌కు అభినందనల వెల్లువ



డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన గంగాధర్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే రాజు, చోడవరం టీడీపీ, జనసేన నేతలు

చోడవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ నాగగంగాధర్ పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ తాతయ్యబాబుతో పాటు, పలువురు టీడీపీ జనసేన నేతలు గురువారం విజయవాడ తరలివెళ్లారు. డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన గంగధర్‌కు ఈసందర్భంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కనిశెట్టి మత్స్యరాజు, మాజీ ఎంపీపీ పెదబాబు, జనసేన నాయకులు సిరిపురపు రమేష్, గూనూరు మూలినాయుడు, టీడీపీ నాయకులు సేనాపతి శ్రీనివాసరావు, సాలాపు నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

రావికమతం, నవంబరు 21, (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ మండల కార్యవర్గ ఎన్నికలు సంఘ జిల్లా సెక్రటరీ కె.సతీశ్ ఆధ్వర్యంలో మేడివాడ హైస్కూల్ గురువారం నిర్వహించారు. ఇందులో అప్పారావు, నాగేశ్వరావు అధ్యక్ష కార్యదర్శులుగా, మహిళ అధ్యక్షురాలిగా తోటకూరపాలెం పాఠశాలకు చెందిన సిహెచ్.దుర్గాలక్ష్మి, ఉపాధ్యక్షులుగా కె.శ్రీనివాసరావు, కార్యదర్శిలుగా యూవీ రమణమూర్తి, సీహెచ్ స్వామినాయుడు , ఎం.రాజేష్, బి.దినకర్, బి.మాలతి, కె.ఉమామహేశ్వరిలతోపాటు గౌరవ అధ్యక్షులుగా బంటు సత్యారావును ఎన్నుకున్నారు. జిల్లా కౌన్సిలర్స్‌గా ఎ.శ్రీనివాసరావు (కొత్తకోట), జి.శాంతదేవి (మేడివాడ), వేపాడ సత్యనారాయణ (చినపాచిల), కె.రాజేంద్ర ప్రసాద్ (కొత్తకోట), అడిట్ కమిటీ కన్వీనర్‌గా గంజి శ్రీను (బుడ్డిబంద), మండల మహిళ కమిటీ కన్వీనర్‌గా కె.రోజారాణి (గుడివాడ)లను సభ్యులు ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేసింది.

పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్

చోడవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటవీధిలో ఎండీవో పీవీ ఎస్. ఆంజనేయులు, ఈవోపీఆర్‌డీ మహేశ్‌ల ఆధ్వర్యంలో పంచాయతీ అధికారులు పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. వీధి కాలువల్లో పూడికలు తొలగించడంతోపాటు, వార్డుల్లో సమస్యలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో నారాయణరావు, ఎంపీటీసీకొట్టాపు రూపాదేవి, నాయకులు చిన్న, సంతోష్ పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకులకు ఇన్‌లైన్ క్లోరినేషన్ యూనిట్లు ఏర్పాటు

మాడుగుల రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లోని వాటర్ ట్యాంకులకు ఇన్‌లైన్ క్లోరినేషన్ యూనిట్లు అమర్చుతున్నట్టు ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. గురువారం వీరనారాయణంలో వాటర్ ట్యాంక్ క్లోరినేషన్ యూనిట్‌ని పరిశీలించారు. ఈ యూనిట్ ఏర్పాటుతో క్లోరినేషన్ ప్రక్రియ సులభతరమవుతుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. మండలంలో 69 వాటర్ ట్యాంకులకు ఆర్ డబ్ల్యుఎస్ ఎస్ఈ ఆదేశాలపై ఈ యూనిట్లు ఏర్పాటు చేసినట్టు వివరించారు.

'పాఠశాలల్లో పెంచిన పని వేళలు ఉప సంహరించుకోవాలి'

దేవరాపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు పెంచిన పని వేళలను వెంటనే ఉప సంహరించుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.జి.నాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని కాశీపురంతో పాటు మండలంలో అన్ని జిల్లా పరిషత్, ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పక్క రాష్ట్రాల్లో ఎ క్కడా ఐదు గంటలు పని వేళలు లేవన్నారు. మన రాష్ట్రంలో 8 గంటలు పాఠశాలలో విద్యార్థులుండడంతో మానసిక ఒత్తిడికి గురవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సత్యంనాయుడు, మండల అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు

▸▸ ఈవోపీఆర్‌డీ కామేశ్వరరావు



సదస్సులో మాట్లాడుతున్న ఈవోపీఆర్‌డీ కామేశ్వరరావు

చీడికాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన గిరిజన గ్రామాలను అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తోందని ఈవోపీఆర్‌డీ కామేశ్వరరావు తెలిపారు. ధాత్రి అభ జనజాతీయ ఉత్కర్ష్ అభియాన్ పథకంలో భాగంగా మండలంలోని కోనాం పంచాయతీ సమావేశమందిరంలో కోనాం పంచాయతీకి చెందిన గ్రామీణ ఉద్యోగులు, గిరిజన కుటుంబాలతో గురువారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన గ్రా మాల్లో నెలకొన్న సమస్యలతోపాటు సంక్షేమ పథకాలకు పెద్దపీట వేసేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ముఖ్యంగా రహదారులు, గృహ నిర్మాణం, సురక్షితమైన తాగునీరు, ఉచిత గ్యాస్, హెల్త్ అండ్ న్యూట్రీషన్ పోషణ, విద్య, విద్యుత్ సమస్యలు తదితర గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. 2028 - 29 సంవత్సరంలోగా దశలవారీగా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుగా యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. ఇందుకుగానూ గురు, శుక్రవారాల్లో ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను, సంక్షేమ పథకాల ను గుర్తించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గ్రామంలో ర్యాలీచేశారు. ఈ సందర్భంగా పనసగెడ్డ గ్రామ గిరిజన యువకుడు పలు సమస్యలు ప్రస్తావించారు. ఈ సమావేశంలో మండల పరిషత్ ప ర్యవేక్షకుడు ఎల్.కామేశ్వరరావు, సర్పంచ్ చలుగు ఈశ్వరమ్మ, ఉపసర్పంచ్ కం టిముఖి సత్యవతి, మాజీ సర్పంచ్ చలుగు అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి ఎస్.సింహాచలంనాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీమంత్రి రెడ్డి సత్యనారాయణకు ఘన నివాళి



మాజీమంత్రి రెడ్డికి నివాళులు అర్పిస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

చోడవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి దివంగత రెడ్డి సత్యనారాయణకు స్థానిక లక్ష్మీపురం వాకర్స్‌క్లబ్ సభ్యులు ఘనంగా నివాళి అర్పించారు. గురువారం వాకర్స్ క్లబ్ ఆవరణలో రెడ్డి సత్యనారాయణ స్మారక సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రెడ్డి సత్యనారాయణ క్రీడలకు ఎంతో ప్రోత్సాహం అందించేవారన్నారు. ఆయన చొరవ వల్లే, వాకర్స్ క్లబ్ ఏర్పాటు సాధ్యమైందన్నారు.ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఓరుగంటి రాంబాబు, జాజుల జగ్గారావు,రిటైర్డ్ హెచ్ఎం టీవీ రమణ, ప్రాత రాజశేఖర్, రత్నం గణేష్, రహిమాన్, నాగఅప్పారావు, నాగేశ్వరరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

కోనాంలో వెల్ఫేర్ అసిస్టెంట్ విధులు నిర్వహణ

▸▸ 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



విధులు నిర్వహిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ మూర్తి

చీడికాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కోనాం సచివాలయంలో ప్రతీ గురువారం అందుబాటులో ఉంటూ విధులు నిర్వహిస్తానని సిరిజాం సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ బి.వరాహమూర్తి తెలిపారు. 'కోనాం సచివాలయానికి ఉద్యోగుల కొరత' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం గురువారం రావడంతో అధికారులు స్పందించారు. సిరిజాం వెల్ఫేర్ అసిస్టెంట్ మూర్తిని కోనాం పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతీ గురువారం కోనాంలో జరిగే సంతకు ఎక్కువమంది గిరిజనులు వస్తున్న దృష్ట్యా వారి సమస్యలు ఆన్‌లైన్ చేసేందుకు ఆ రోజు తప్పనిసరిగా హాజరవుతానని ఆయన తెలిపారు. ఈ మేరకు ఎంపీడీవో ఆదేశాలు జారీ చేశారన్నారు.

దేవరాపల్లి -వాలాబు రోడ్డుకు మోక్షం కల్పించండి

దేవరాపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దేవరాపల్లినుంచి వాలాబు వెళ్లే ప్రధాన రహదారి మరమ్మతులు చేపట్టాలని కోరుతూ ఎంపీడీఓ కార్యాలయ పరిపాలన అధికారి లక్ష్మీనారాయణకు సీపీఎం మండల కార్యదర్శి బి.టి.దొర ఆధ్వర్యంలో పలువురు గురువారం వినతి పత్రమిచ్చారు. నిత్యం విద్యార్థులు, వ్యాపారుల, ఇతర వర్గాలు దేవరాపల్లి రావల్సి ఉంటుందని ఈ సందర్భంగా తెలిపారు. బుచ్చంపాలెం నుంచి చింతలపాలెంకు గర్భింగి సచివాలయానికి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం కల్పించాలని వారు కోరారు.

అయ్యప్ప భక్తుల పేడతుళ్లు సంబరాలు



సీతంపేటలో అయ్యప్ప భక్తులు

దేవరాపల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగయ్యపేట శివారు సీతంపేటలో అయ్యప్ప భక్తులు గురువారం పేడతుళ్ల సంబరాలు నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు 41 రోజులు దీక్ష ద్విగ్విజయంగాపూర్తయిన నేపథ్యంలో శబరి మల యాత్ర సజావుగా జరగాలని మొక్కుకున్నారు. గ్రామంలో ఉన్న దేవతలందరికీ పసుపు, కుంకుమలతో పూజలు చేశారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

కె.కోటపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఏ. కోడూరు ఫీడర్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ఎం. చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో సింగన్నదొరపాలెం శివారు రామచంద్రపురం, కొత్త అగ్రహారం గ్రామాలతో పాటు సూరెడ్డిపాలెం, ఏ.కోడూరు, పొడుగుపాలెం గ్రామాల వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

దేవరాపల్లిలో..

దేవరాపల్లి: మండల కేంద్రంలో మరమ్మతు పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుచేయనున్నట్టు ట్రాన్స్‌కో ఏఈఈ కర్రి శంకరరావు గురువారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

విత్తనోత్పత్తి పథకంపై అవగాహన

రోలుగుంట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రైతులకు గురువారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయలో రైతులకు విత్తనోత్పత్తి పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనకాపల్లి డీఆర్‌సీ ఏఓ విజేత పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం వరిలో తెగుళ్ల నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. రెల్ల రాల్చు పురుగు నివారణకు క్లోరంత్రానిలిప్రోల్ 60ఎంఎల్ ఒక ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. కంకినల్లి నివారణకు థైంపెంత్రిన్ 500ఎంఎల్ ఒక ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. ప్రస్తుతం మినుము విత్తనాలు జల్లేముందు విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ విజయలక్ష్మి, పలువురు వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

4 వేల ఎకరాల ఫ్రీహోల్డ్ భూములపై రీవెరిఫికేషన్

▸▸ నర్సీపట్నం ఆర్డీఓ వీవీ రమణ



రోలుగుంట తహసీల్దార్‌తో సమావేశమైన ఆర్డీఓ

రోలుగుంట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం డివిజన్‌లో 4వేల ఎకరాల ఫ్రీహోల్డ్ భూములపై రీవెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్టు ఆర్డీఓ వీవీ రమణ పేర్కొన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం తహసీల్దార్ నాగమ్మతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోలుగుంట మండలానికి సంబంధించి 24 పంచాయతీల్లో ఇచ్చిన 1162 ఎకరాల ఫ్రీహోల్డ్ భూములపై శుక్రవారం సాయంత్రం లోగా వెరిఫికేషన్ పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. గ్రామ వీఆర్వోలు, సర్వేయర్ల సహాయంతో ఈ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. రోలుగుంట మండలానికి సంబంధించి 10 టీమ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే, రైతుల నుంచి వచ్చిన రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు విచారణ పూర్తి చేసి పరిష్కరించాలని తహసీల్దార్‌కు సూచించారు. మీ కోసం వచ్చిన వినతులు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీటీ శంకర్‌రావు, ఆర్ఐ రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి సమితి ఆధ్యాత్మిక కార్యక్రమాలు

కె.కోటపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : భగవాన్ సత్యసాయిబాబా 99వ జయంతి పురస్కరించుకుని కె. కోటపాడు రామాలయంలో బుధవారం రాత్రి పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఓంకారంతో ప్రారంభమై.. వేదపఠనం, బాబా నామ సంకీర్తన, ఎవరైనా చెప్పినట్టు చేస్తారా అనే నాటకాన్ని సత్యసాయి విద్యార్థులు ప్రదర్శించారు. అనంతరం కేకు కటింగ్ మిఠాయి పంచారు. సత్యసాయి కె. కోటపాడు సమితి కన్వీనర్ బండారు నారాయణపాత్రుడు, గజ్జి అప్పలనాయుడు, సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఆటో బోల్తా

▸▸ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

కొత్తూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఉల్లిపాయల లోడుతో వెళ్తున్న ఆటో బోల్తా పడింది. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా వున్నాయి. నర్సీపట్నం నుంచి పల్లెవెలుగు బస్సు అనకాపల్లి వైపు వస్తున్నది. అనకాపల్లి మండలం పిసినికాడ వద్దకు వచ్చే సరికి ముందు వెళుతున్న ఉల్లిపాయల లోడు ఆటోను ఢీకొన్నది. దీంతో ఆటో పక్కనే ఉన్న కల్వర్టులోకి దూసుకుపోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆటో పూర్తిగా ధ్వంసమైంది. స్థానికులు వెంటనే స్పందించి ఆటో డ్రైవర్‌ను బయటకు తీశారు. చికిత్స నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ప్రమాదానికి సంబంధించి తమకు ఫిర్యాదు రాలేదని అనకాపల్లి రూరల్ పోలీసులు తెలిపారు.

చెరకు క్రషర్ బెల్టులో పడి మహిళా కూలీ మృతి


శరకం పద్మ (ఫైల్ ఫొటో)

మాకవరపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చెరకు క్రషర్ బెల్టులో పడి ఒక మహిళా కూలీ మృతిచెందింది. ఎస్ఐ దామోదరనాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. జంగాలపల్లి శివారు కాలనీకి చెందిన శరకం పద్మ(49) ఇదే గ్రామంలో ఉన్న బెల్లం తయారీ క్రషర్‌లో కొంతకాలంగా పనిచేస్తున్నది. గురువారం క్రషర్‌లోకి చెరకు వేస్తుండగా, ఆమె చీర బెల్టుకు చిక్కుకుని లోపలికి లాగేసింది. దీంతో అక్కడ ఉన్న కార్మికులు వెంటనే క్రషర్‌ను ఆపివేశారు. అయితే అప్పటికే పద్మ మృతిచెందింది. తమకు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

మగువల్లో ఆధ్యాత్మిక చైతన్యం

కోలాటంలో రాణిస్తున్న ఎన్‌జీపాలెం మహిళలు

- పండుగలు, ఉత్సవాల సందర్భంగా ప్రదర్శనలు
- శరీరానికి ఆరోగ్యం, మనస్సుకు ఆహ్లాదం

ఎలమంచిలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): 'మడిసన్నాక కూసంత కలాపోసన ఉండాలి' అని ఎప్పుడో ఐదు దశాబ్దాల క్రితం వచ్చిన ముత్యాలముగ్గు సినిమాలో విలక్షణ నటుడు రావు గోపాలరావు చెప్పిన డైలాగ్ ఇప్పటికీ ఎంతో ప్రాచుర్యంలో వుంది. నిత్య జీవితంలో ఎన్ని పనులు ఉన్నప్పటికీ కళలకు కూడా కొంత సమయం కేటాయిస్తున్నారు కశింకోట మండలం నూతనగుంటపాలెం (ఎన్‌జీ పాలెం) గ్రామానికి చెందిన మహిళలు. నితంతరం ఇంటి పనులు, పొలం పనులతో బిజీగా వుండే వీరు.. కొద్దిపాటి వెసులుబాటు లభించినా కోలాటం నేర్చుకోవడానికి, ప్రదర్శించడానికి ఆసక్తిచూపుతున్నారు. అందరిలా కాకుండా తమకంటూ ఒక గుర్తింపు కోసం కోలాటాన్ని ఎంచుకున్నట్టు మహిళలు చెబుతున్నారు. పుణ్యం, పురుషార్థం అన్నట్టు.. కోలాటంతో శరీరానికి ఆరోగ్యం, మనస్సుకు ఆహ్లాదంతోపాటు ఆధ్యాత్మిక ప్రశాంతత చేకూరుతుందని అంటున్నారు.

ఎలమంచిలి ద్వారకానగర్‌కు చెందిన తెనకాల సన్యాసిరావు అనే కళాకారుడి సుమారు రెండున్నర దశాబ్దాల నుంచి ఎంతో మందికి కోలాటంలో తర్ఫీదు ఇచ్చారు. నూతనగుంటపాలెం గ్రామానికి చెందిన మహిళలు కూడా ఇతని వద్దనే శిక్షణ పొందారు. 'శ్రీ నూకాంబిక కోటాలం బృందం' పేరుతో ఎలమంచిలి, కశింకోట మండలాల్లోని పలు గ్రామాల్లో వివిధ సందర్భాల్లో కోలాటం ప్రదర్శనతో తమ ప్రతిభను చాటుకున్నారు. ఆలయాల ప్రారంభోత్సవంతోపాటు వినాయక చవితి, దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు, హనుమాన్ జయంతి, శ్రీరామనవమి, సంక్రాంతి తదితర పండుగల సమయంలో కచ్చితంగా ఎన్‌జీ పాలెం మహిళల కోలాటం ఉండాల్సిందే! ఆయా ఉత్సవాల నిర్వాహకులు చాలా రోజులు ముందుగానే కోలాటం బృందాన్ని కలిసి, ఫలాన రోజున తమ గ్రామంలో కోలాటం ప్రదర్శించాలని కోరుతుంటారు.

కోలాటంలో భాగంగా దేవతామూర్తుల వేషధారణలతో పురాణ, ఇతిహాస ఘట్టాలను కళ్లకుకట్టినట్టు ప్రదర్శిస్తుంటారు. శిరస్సుపై కలశాలను పెట్టుకుని, శూలాలుచేతిబూని మహిసాసురుడిని వధించే దుర్గాదేవి ప్రదర్శన హైలైట్ అని చెప్పక తప్పదు. శ్రీకృష్ణుడు, శ్రీరాముడు, శివుడు, విష్ణుమూర్తి, దుర్గామాతలను కొలుస్తూ ఆలపించే భక్తి గీతాలకు అనుగుణంగా కోలాటం ప్రదర్శిస్తుంటారు. వీరు కోలాటాన్ని తిలకించడానికి స్థానికులే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా ప్రజలు వస్తుంటారు. అంతరించిపోతున్న సంప్రదాయ కళలకు జీవం పోయడానికి తమవంతు కృషి చేస్తున్న ఎన్‌జీ పాలెం మహిళలకు హ్యాట్సాఫ్!


దుర్గాదేవి అవతారంలో మహిషాసుర వధను కోలాటం ద్వారా ప్రదర్శిస్తున్న మహిళలు

మానసిక ఉల్లాసం



నేను ఐదు సంవత్సరాల నుంచి కోలాటం ఆడుతున్నాను. మా బృందం కోలాటాన్ని ప్రదర్శిస్తున్నప్పుడు తిలకిస్తున్న వారి నుంచి వచ్చే స్పందన మాకు మరింత ఉత్తేజాన్ని నింపుతుంది. ఆలయాల ప్రారంభోత్సవాలకు భక్తి కీర్తనలతో కోలాటం చేయడం మా ప్రత్యేకత. ప్రజల్లో ఆధ్యాత్మిక చైతనం కలిగిస్తున్నందుకు మానసికంగా ఎంతో ఆనందంగా వుంది.

కె.రమణమ్మ, ఎన్‌జీ పాలెం


నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎలమంచిలిలో కోలాటం ఆడుతున్న ఎన్‌జీ పాలెం మహిళలు

నాడు నేర్చుకున్నాం.. నేడు నేర్పుతున్నాం



మా బృందం ఐదేళ్ల నుంచి కోలాటం ప్రదర్శిస్తున్నది. చుట్టుపక్కల గ్రామాల్లో ఆలయాల ప్రారంభోత్సవాలు, నవరాత్రి ఉత్సవాలు, ఇతర శుభ కార్యాలయాలకు కోలాటం ఆడుతుంటాం. భద్రాచలం రాముల వారి క్షేత్రం, విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో చేసిన కోలాటం ప్రదర్శనలు జీవితంలో మరిచిపోలేం. సహచర మహిళలు, బాలికలకు కూడా కోలాటం నేర్పుతున్నాం. సరదాగా నేర్చుకున్న కోలాటం మాకు గుర్తింపు తీసుకురావడం ఆనందంగా వుంది.

డి.సత్యవతి, ఎన్‌జీ పాలెం

వందకుపైగా బృందాలకు కోలాటంలో తర్ఫీదు



కోలాటం, చెట్టు భజనలు, హరి భజనలు, చిటికెల భజనలను చిన్నతనంలోనే నేర్చుకున్నారు. సుమారు 25 ఏళ్ల నుంచే వందకుపైగా బృందాలకు కోలాటంలో తర్ఫీదు ఇచ్చాను. పాల వ్యాపారం నా వృత్తి.. కోలాటం నేర్పడం నా ప్రవృత్తి. రోజూ ఉదయాన్నే రైతుల నుంచి పాలను సేకరించి, పట్టణంలో పలువురి ఇళ్లకు వెళ్లి విక్రయిస్తుంటాను. సాయంత్రం తరువాత ఆయా గ్రామాలకు నేనే వెళ్లి మహిళలకు కోలాటంలో తర్ఫీదు ఇస్తుంటాను.

తెనకాల సన్యాసిరావు, ఎలమంచిలి

కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్‌గా

పీవీజీ కుమార్ బాధ్యతలు స్వీకరణ

అనకాపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కొప్పల వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్‌గా మాడుగుల నియోజకవర్గానికి చెందిన పీవీజీ కుమార్ గురువారం విజయవాడలోని బీసీ భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్‌రాజు, ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, కూటమి పార్టీల నేతలు పాల్గొని అభినందలు తెలిపారు.


కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న పీవీజీ కుమార్. చిత్రంలో ఎమ్మెల్యేలు బండారు, రాజు, లలితకుమారి, కార్పొరేషన్ల చైర్మన్లు పీలా గోవింద, తాతయ్యబాబు, తదితరులు

రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో సత్తాచాటిన నక్కపల్లి క్రీడాకారులు

- జాతీయ పోటీలకు పలువురు ఎంపిక

నక్కపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి బీఎస్ హాకీ క్లబ్‌కు చెందిన పలువురు క్రీడాకారులు జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్టు క్లబ్ వ్యవస్థాపకులు బలిరెడ్డి సూరిబాబు, కార్యదర్శి కొల్నాటి తాతాజీ చెప్పారు. నెల్లూరులో ఈ నెల మొదటి వారంలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-17 బాల, బాలికల హాకీ పోటీల్లో నక్కపల్లి క్రీడాకారులు ఉత్తమ ప్రతిభకనబరిచారని, దీంతో జెట్టి గాయత్రి జాతీయ స్థాయిపోటీలకు ఎంపికైందని వెల్లడించారు. త్వరలో హరియాణాలో జరగనున్న జాతీయ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టులో ఆమెకు చోటు లభించందని పేర్కొన్నారు. ఇటీవల నక్కపల్లిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్-14 హాకీ పోటీల్లో బాలికల విభాగంలో జి.జ్యోతి, ఆర్.చైతన్య, కె.శ్రావ్య, బాలుర విభాగంలో కె.నాగతరుణ్, ఎం.దిలీప్‌కుమార్, ఎ.దేవేంద్ర వెంకట్ చక్కటి ప్రతిబ చూపి జాతీయ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్లకు ఎంపికైనట్టు చెప్పారు. మధ్యప్రదేశ్‌లో డిసెంబరు 25 నుంచి 31వ తేదీ వరకు జరిగే పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను హాకీ క్లబ్ అధ్యక్షుడు చిన్న అప్పారావు, కోచ్ రాంబాబు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, తదితరులు అభినందించారు.


అండర్-17 జాతీయ హాకీ పోటీలకు ఎంపికైన జె.గాయత్రి


జాతీయ హాకీ పోటీలకు ఎంపికైన నక్కపల్లి క్రీడాకారులు

మత్స్యకారుల అభివృద్ధికి కృషి

- కలెక్టర్ విజయకృష్ణన్
- తాండవలో ఐదు లక్షల చేప పిల్లలు విడుదల

నాతవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తూ రాయితీలను అందిస్తున్నదని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆమె మండలంలోని తాండవ జలాశయంలో జాలారిపేట వద్ద వివిధ రకాలకు చెందిన ఐదు లక్షల చేప పిల్లలను విడుదల చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నాతవరం, గొలుగొండ మండలాల్లో 12 గ్రామాలకు చెందిన మత్స్యకారులకు పుష్కలంగా జీవనోపాధి లభిస్తుందన్నారు. అనంతరం తాండవ ఆనకట్టపై పర్యటించి రిజర్వాయర్, కొండలు, అడవుల అందాలను తిలకించారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన పలువురు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. తాండవ రిజర్వాయర్‌కు చెందిన భూమిని కొంతమంది స్థానికులు ఆక్రమించి జీడిమామిడి తోటలు సాగుచేస్తున్నారని, వర్షా కాలంలో తాండవలోకి పూడిక చేరుతున్నదని, ఆక్రమణలను తొలగించాలని టీడీపీ నాయకుడు అపన్న విజయ్ ఫిర్యాదు చేశారు. టీడీపీకి చెందిన మరో నాయకుడు షేక్ రజాక్ మాట్లాడుతూ, తాండవ ఆరోగ్య ఉప కేంద్రంలో పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డీవో రమణ, స్థానిక తహసీల్దార్ ఎ.వేణుగోపాల్, జిల్లా మత్స్య శాఖ అధికారి పి.ప్రసాద్, స్థానిక మత్స్య శాఖ అధికారి టి.నాగమణి, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నాగశిరీషా, ఎంపీడీవో ఉషశ్రీ, ఎంఈఓ సత్యనారాయణ, రాజకీయ పార్టీల నేతలు కరక సత్యనారాయణ, సాగిన లక్ష్మణమూర్తి, ఎన్.విజయ్‌కుమార్, పారుపల్లి కొండబాబు, సింగంపల్లి సన్యాసిదేముడు, గంటా శ్రీనివాసరావు, మల్లీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


తాండవలో చేప పిల్లలను విడుదల చేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

మాదక ద్రవ్యాల మత్తులో పడొద్దు

- భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు
- యువతకు విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి సూచన

పాయకరావుపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాల మత్తులో పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి సూచించారు. గురువారం స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో నిర్వహించిన సంకల్పం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, టెక్నాలజీ పెరగడం వల్ల సోషల్ మీడియాలో నేరాలు చేయడం, తప్పుడు సందేశాలు ప్రచారం జరగడంతో పాటు సైబర్ నేరాలు గణనీయంగా పెరిగాయన్నారు. మాదక ద్రవ్యాల కేసులో 20 సంవత్సరాల వరకు జైలుశిక్ష పడుతుందని, దీంతో జీవితం అంధకారమవుతుందన్నారు. యువత ఇటువంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అల్లూరి జిల్లాలోని 11 మండలాల్లో గంజాయి సాగవుతున్నట్టు గుర్తించి పూర్తిగా ధ్వంసం చేశామన్నారు. మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు తెలపడంలో అందరూ సహకరించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. సైబర్ నేరాలు జరగకముందే వాటిని నివారించేందుకు పోలీసు వ్యవస్థ నిత్యం తన సామర్థ్యాన్ని పెంచుకుంటోందన్నారు. అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్ల జోలికి వెళ్లకూడదని, చదువుపై దృష్టి సారించి ఉన్నత గమ్యాలను చేరుకోవడానికి నిత్యం శ్రమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్, నర్సీపట్నం డీఎస్పీ జీఆర్ఆర్ మోహన్, సీఐలు జి.అప్పన్న, కుమారస్వామి, రామకృష్ణ, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి, హాజరైన విద్యార్థులు

ఎన్టీపీసీలో రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీలు


చిత్రలేఖనం పోటీ విజేతలతో సింహాద్రి హెచ్‌ఓపీ సమీర్‌శర్మ, తదితరులు

పరవాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో దీపాంజలినగర్‌లో గురువారం 'ఎనర్జీ కన్జర్వేషన్ టు ప్రొటెక్ట్ ద ఎన్విరాన్‌మెంట్' అనే అంశంపై రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. సుమారు 100 మంది విద్యార్థులు హాజరయ్యారు. 5, 6, 7 తరగతుల విద్యార్థులను ఏ-గ్రూప్‌గా, 8, 9, 10 తరగతుల విద్యార్థులను బీ-గ్రూప్‌గా విభజించి పోటీలు నిర్వహించారు. ఒక్కో గ్రూప్ నుంచి ముగ్గురు చొప్పున విజేతలను ఎంపిక చేశారు. ప్రథమ బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు, తృతీయ బహుమతి రూ.20 వేలు, కన్సొలేషన్‌గా రూ.7,500 చొప్పున ప్రకటించారు.

విజేతలు వీరే..

ఏ-గ్రూప్ నుంచి వి.రౌనక్‌కుమార్(ప్రెసిడెన్షియల్ స్కూల్, సీతమ్మధార), బోడా సూర్య వెంకట చరణ్ (శ్రీ సత్యసాయి గురుకులం, రాజమండ్రి), బి.జనీర్ ప్రణీత (టింపనీ సీనియర్ సెకండరీ స్కూల్, విశాఖపట్నం), బీ-గ్రూప్ నుంచి తాన్యా గోస్వామి (బాలభారతి పబ్లిక్ స్కూల్, సింహాద్రి), సీహెచ్ భావజ్ఞ (శ్రీప్రకాష్ విద్యా నికేతన్), ధనలక్ష్మి(డీఏవీ పబ్లిక్ స్కూల్, ఉక్కునగరం) విజేతలుగా నిలిచారు.

విద్యార్థుల్లో సృజనాత్మకు దోహదం

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు చిత్రలేఖనం పోటీలు ఎంతగానో దోహదపడతాయని సింహాద్రి హెడ్ ఆఫ్ ది ప్రాజెక్టు (హెచ్‌ఓపీ) సమీర్‌శర్మ అన్నారు. చిత్రలేఖనం పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రస్థాయి పోటీలను సింహాద్రి ఆధ్వర్యంలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి వివిధ విభాగాల జీఎంలు గడ్డం నోవా, రష్మీరంజన్ పరిదా, ప్రశాంత్‌కుమార్‌జీనా, హెచ్‌ఆర్ విభాగం హెడ్ టీటీ పాత్ర, సీఎస్‌ఆర్ విభాగం అధికారి కె.ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

రియల్టర్ దందా

... 5వ పేజీ తరువాయి

నిర్మించేశారు. అడ్డుగా వున్న భారీగా తాటి చెట్లను నరికి వేశారు. ఈ విషయం తెలుసుకున్న వీఆర్వో సింహాచలం నాయుడు.. రోడ్డుకి అడ్డంగా కాలువ తవ్వించారు. అయితే రియల్టర్ తెల్లవారే సరికి కాలువను పూడ్చివేసి, మిగతా రోడ్డు కూడా వేసేశారు. ఆక్రమించిన గోర్జి భూమి విలువ సుమారు కోటి రూపాయలు చేస్తుంది. కాగా గోర్జి ఆక్రమించి రోడ్డు నిర్మించిన వైనంపై మడుతూరు సర్పంచ్ మోటూరు సంజీవిని వివరణ కోరగా.. పంచాయతీ నుంచి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. కబ్జాదారునిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను కోరామని తెలిపారు.

చోరీ కేసుల్లో ముగ్గురి అరెస్టు

... 5వ పేజీ తరువాయి

చేశామన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామన్నారు. చోరీ సొత్తును రికవరీ చేయడంలో కీలకంగా వ్యవహరించిన సీసీఎస్ సిబ్బందిని ప్రశంసించారు. ఈ సమావేశంలో పరవాడ సీఐ మల్లికార్జునరావు, అచ్యుతాపురం సీఐ ఎన్.గణేశ్, సీసీఎస్ ఎస్ఐ పి.రమేశ్ పాల్గొన్నారు.

పింఛన్‌దారులకు భరోసా!

... 5వ పేజీ తరువాయి

కోల్పోయారు. పింఛన్‌ను పునరుద్ధరించాలని వేడుకున్నా పట్టించుకోలేదు. గత ఎన్నికల ముందు ప్రచార సమయంలో పలువురు పింఛన్‌దారులు ఈ విషయాన్ని కూటమి నేతల దృష్టికి తీసుకువచ్చారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత ఈ సమస్యను పరిష్కరిస్తామని చంద్రబాబు, లోకేశ్, పవన్‌కల్యాణ్‌తోపాటు పలువురు నాయకులు హామీ ఇచ్చారు. కూటమి అధికారంలోకి రావడంతో పింఛన్‌దారుల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అనివార్య కారణాల వల్ల వరుసగా రెండు నెలలు పింఛన్ తీసుకోకపోయినా మూడో నెలలో మొత్తం చెల్లించాలని ప్రభుత్వ నిర్ణయం తీసుకుంది. దీనిపై పింఛన్‌దారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో గత నెలలో 2,60,816 మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లు మంజూరయ్యాయి. సచివాలయ సిబ్బంది పింఛన్‌లు పంపిణీకి వెళ్లిన సమయంలో ఇంటికి తాళం వేసివున్న వారు 323 మంది, అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారు 92 మంది, ఇతర రాష్ట్రాలకు వెళ్లిన వారు 151 మంది, తాత్కాలికంగా అందుబాటులో లేని వారు 129 మంది.. మొత్తం 1,559 మంది గత నెలలో పింఛన్ డబ్బులు అందుకోలేదు. వీరు డిసెంబరు నెలలో అందుబాటులో ఉంటే రెండు నెలల పింఛన్ అందిస్తామని డీఆర్‌డీఏ పీడీ శచీదేవి తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569